## తిరుమల చేరుకున్న బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర

తిరుమల ( ప్రతినిధి) :



సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ సంకల్ప యాత్ర తిరుమలకు చేరుకుంది. వైకాపా హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ఏపీ సీఎం చంద్రబాబు అరెస్టైన సమయంలో మొక్కుకున్న మొక్కును తీర్చుకునేందుకు ఆయన పాదయాత్ర ప్రారంభించిన విషయం తెలిసిందే. షాద్‌నగర్ నుంచి ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేశ్ మాట్లాడుతూ.. "23 రోజులు అడ్డంకులు లేకుండా 537 కిలోమీటర్ల మేర సంకల్ప యాత్ర చేసి శ్రీవారి సన్నిధికి చేరుకున్నా. శ్రీవేంకటేశ్వరుడిని నమ్ముకొ నష్టపోయినవారు లేరు. నిజాయతీగా కోరుకున్నా.. నా మొర ఆలకించారు. నా జన్మలో ఇది గొప్ప ఘట్టం. ఈ జన్మంతా శ్రీవారికి సేవ చేస్తాను" అని తెలిపారు.


# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సంపుటి : 13 సంచిక : 142 పేజీలు : 8 వెల : 1/- బుధవారం 11 ఫిబ్రవరి 2026

Circulated by vijayawada, AlluriSeetharamaraju, Vizianagaram,Parvathipuram, Srikakulam, Kakinada,East Godavari,Konaseema, West Godavari, Krishna,Guntur, Bapatla,NTR,Anantapuram, Satyasai Kurnool,Nandyala, Chittoor,Tirupati,Annamayya, Telangana State


# పార్లమెంటులో ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధతపై బిల్లు పెట్టాలి

### కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయిన సీఎం చంద్రబాబు

ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై భేటీలో చర్

ఇప్పటికే పార్లమెంటులో బిల్లు పెట్టాలని నిర్ణయించిన కేంద్రం

ఢిల్లీ, ౯ (ప్రతినిధి) :

**ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై చర్చించారు. ఇప్పటికే పార్లమెంటులో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించగా, అందుకు అనుగుణంగా కేబినెట్ నోట్ తయారీ జరుగుతుంది. బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని చంద్రబాబు అమిత్?షాను కోరారు. దీనికి ముందే కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన సీఎం ఏపీలోని సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయం కోరుతూ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్తు, తాగునీటి భద్రత, వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయం విషయంలో పెండింగ్ అంశాలపై చర్చించారు.**

అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సీఎం చర్చించారు. పోలవరం ప్రాజెక్టు స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా చూడాలని విన్నవించినట్లు సమాచారం. స్టాప్‌వర్క్ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కాలువల సామర్థ్యం పెంపుతో పెరిగిన వ్యయం రీయింబర్స్ చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్? -2కి ఆర్థిక సహాయం అందించాలని, ఫేజ్-2లో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టల పనులు చేపట్టాల్సి ఉందని వివరించారు. ఈ పనులకు అదనంగా సుమారు రూ.32 వేల కోట్లు అవసరమని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. పోలవరం - నల్లమలసాగర్? లింక్? ప్రాజెక్టు అంశంపై భేటీలో చర్చించారు. ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చి సాంకేతిక, ఆర్థిక సాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వీటితోపాటు ఏపీ-ఒడిశా మధ్య వంశధార నీటి



వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రైబ్యునల్ తుది నివేదిక గెజిట్‌లో ప్రచురించాలని, వంశధారపై నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని కోరారు. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. నదీ జలాల పంపకానికి గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక చేపట్టిన చర్యలపై అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి ఎత్తు పెంపుతో ఏపీకి వచ్చే దిగువ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని సీఎం తెలిపారు.

ఆరుగురు కేంద్రమంత్రులతో భేటీకానున్న చంద్రబాబు:

ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరుగురు కేంద్రమంత్రులతో భేటీ అవుతున్నారు. ఇప్పటికే కేంద్రమంత్రులు సీఆర్ పాటిల్, అమిత్ షా చర్చలో పాల్గొన్న సీఎం నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్, అశ్వినీ వైష్ణవ్‌తో భేటీకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్, ఉదయం 11 గం.కు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పలు అంశాల గురించి సీఎం చర్చించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో, మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌తో, సాయంత్రం 4 గంటలకు ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబు భేటీ కానున్నారు.

# రేపటి నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

### రేపు ఉదయం 10 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం..

### రేపు ఉదయం 10: 30 గంటలకు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం..




అమరావతి (ప్రతినిధి) :

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు రేపు ( ఫిబ్రవరి 11న) ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. ఇక, రేపు మార్నింగ్ 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బడ్జెట్ ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు.**

అయితే, కాసేపట్లో ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేయనున్నారు. ఈ సమావేశానికి మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు పలువురు అధికారులు హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎస్ విజయానంద్, వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఇక, అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేయనున్నారు.

# కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ



ఢిల్లీ, ౯ (ప్రతినిధి) :

ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం ఉదయం కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పోలవరం నిర్మాణ పురోగతితో పాటు రాష్ట్రానికి చెందిన ఇతర ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థికసాయంపై చర్చించారు. జల్ జీవన్ మిషన్ పథకానికి నిధులు తదితర అంశాలపై కేంద్రమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. పలు ప్రాజెక్టులకు కేంద్ర సాయం పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు అంతర్రాష్ట్ర జల వివాదాలపై చర్చించారు. పోలవరం ప్రాజెక్టుకు స్టాప్ వర్క్ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని కేంద్రమంత్రిని చంద్రబాబు కోరారు. దీని కారణంగా అవరోధాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు ఫేజ్-2కి ఆర్థిక సాయం అందించాలని.. భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని సీఆర్ పాటిల్ దృష్టికి చంద్రబాబు తీసుకెళ్లారు. దీనికి అదనంగా సుమారు రూ.32వేల కోట్ల నిధులు అవసరమని చెప్పారు. గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు చేపడతున్నట్లు సీఎం తెలిపారు.

తాగు, సాగు నీటితో పాటు పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టు ఇది అని చెప్పారు. నదుల అనుసంధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ, ఒడిశా మధ్య ఉన్న వంశధార జల వివాదాలను పరిష్కరించాలని కోరారు.

### మానవ అక్రమ రవాణాపై

# స్టింగ్ ఆపరేషన్..

### అమెరికాలో తెలుగు వ్యక్తి అరెస్ట్

ఢిల్లీ, (ప్రతినిధి) :



**మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు అమెరికాలోని జార్జియాలో స్టింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలోనే ఎనిమిది మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన చాడ సుహురత్ రెడ్డి కూడా ఉన్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. గత నెలాఖరులో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.**

జనవరి 29, 30 తేదీల్లో ది శాండీ స్ప్రింగ్స్ పోలీసులు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. వ్యభిచార ముఠాలు, మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యంగా అట్లాంటాలోని పలు హోటళ్లలో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే అక్రమ లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం వంటి అభియోగాల కింద ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. దీనిపై మరింత సమాచారం తెలియాల్సిఉంది.

# టీటీడీ లడ్డు కేసులో హవాలా కోణం..

### హవాలా రూపంలో రూ. 234.5 కోట్లు మళ్లించినట్లు గుర్తించిన ఈడీ..

### టీటీడీ లడ్డు వ్యవహారంపై విచారణ ప్రారంభించిన ఈడీ..


### హవాలా డబ్బులు ఢిల్లీ నుంచి హైదరాబాద్, తిరుపతి, చెన్నై, విజయవాడలకు చేరినట్లు అంచనా..

### రూ. 234.5 కోట్లకు పైగా నిధుల మళ్లించినట్లు ఈడీ ప్రాథమిక అంచనాలు..

అమరావత్ (ప్రతినిధి) :

**తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రసాదంగా ఇచ్చే లడ్డూ తయారీలో అవకతవకలు, హవాలా లావాదేవీల ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక అంశాలను గుర్తించడంతో, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ అధికారికంగా విచారణ ప్రారంభించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎస్ఐటీ రూపొందించిన నివేదికలో, టీటీడీ లడ్డూ తయారీలో ఉపయోగించే ముడి సరుకుల సరఫరా, కాంట్రాక్టులు, నాణ్యత తనిఖీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నట్టు సమాచారం. ముఖ్యంగా నెయ్యి సరఫరా, టెండర్ల మంజూరు, ల్యాబ్ పరీక్షల నివేదికల విషయంలో అవినీతి చోటు చేసుకున్నట్టు SIT గుర్తించింది.**

అయితే, ఎస్ఐటీ నివేదిక ప్రకారం, లడ్డూ తయారీకి



సంబంధించిన కొన్ని కాంట్రాక్టుల ద్వారా వచ్చిన లాభాలను హవాలా మార్గంలో దేశంలోని పలు నగరాలకు మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఢిల్లీ, చెన్నై, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాల్లో హవాలా నెట్‌వర్క్ ద్వారా డబ్బు తరలింపులు జరిగినట్టు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు రూ. 234.5 కోట్లకు పైగా నిధుల మళ్లింపు జరిగినట్టు ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. ఈ అక్రమ లావాదేవీల్లో మధ్యవర్తులు, డైరీ సంస్థలు, సరఫరాదారులు, కొందరు అధికారుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చాయి. లడ్డూ తయారీలో ఉపయోగించే నెయ్యి నాణ్యతకు సంబంధించిన ల్యాబ్ నివేదికలను ఉద్దేశపూర్వకంగా


మిగతా 2వ పేజీలో

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# 58వ వార్డులో జెడ్సీ పర్యటన..



**గాజువాక, వ్ విలేకరి**

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధి 58వ వార్డులో మంగళవారం వెస్ట్ జోన్ కమీషనర్ కె హేమావతి విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో రామనగర్, గుల్లలపాలెం, పిలకవానిపాలెం తదితర ప్రాంతాలలో గల ప్రధాన గెడ్డలను పరిశీలించారు. గెడ్డల్లో ఎటువంటి వ్యర్థాలను వేయకుండా సంబంధిత అధికారులు నిత్య పర్యవేక్షణ చేసి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోన్ ఎస్ ఎస్ వెంకటేశ్వర్లు, వార్డు శానిటరీ ఇనిస్పెక్టర్ డి రవికుమార్ తదితరులతో పాటు పలు విభాగాల జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పైడిమాంబ అమ్మవారికి ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక పూజలు..



**గోపాలపట్నం,‾ విలేకరి**

విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధి గోపాలపట్నంలో గల పైడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే గణబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గణబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అగ్రభాగాన విజయవాడ పశ్చిమ.. అట్టడుగున గుంటూరు పశ్చిమ

**అమరావతి (పబ్లిక్ ప్రతినిధి) :**

వివిధ అభివృద్ధి సూచికల ఆధారంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రభుత్వం కేటాయించిన గ్రేడ్‌లలో విజయవాడ పశ్చిమ మొదటి స్థానంలో నిలిచింది. జనవరి నెల వరకు సేకరించిన డేటా ఆధారంగా పనితీరును ప్రభుత్వం మదింపు చేసింది. మొత్తంగా ఏం గ్రేడ్‌లో 21, ఏ- గ్రేడ్‌లో 153 నియోజకవర్గాలు నిలవగా, కేవలం గుంటూరు పశ్చిమ ఒక్కటే బి- గ్రేడ్‌లో ఉండటం గమనార్హం. రాష్ట్ర సచివాలయంలో సోమవారం నిర్వహించిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ నియోజకవర్గాల వారీగా గ్రేడ్‌లను వెల్లడించారు.

### ఇదీ గ్రేడింగ్ ప్రాతిపదిక

పనితీరు ఆధారంగా స్కోర్ 90% కంటే ఎక్కువ సాధించిన నియోజకవర్గాలకు ఏం గ్రేడ్, 89%-75% ఉంటే ఏ- గ్రేడ్, 74%-50% మధ్య ఉంటే బి- గ్రేడ్ కేటాయించింది. దేశంలో మొదటిసారిగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ) విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఎమ్మెల్యే, ప్రత్యేక అధికారి, నాలెడ్జ్ పార్టనర్, యంగ్ ప్రొఫెషనల్‌తో పాటు మరో ఐదుగురు గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని నియమించారు. ఆయా నియోజకవర్గాల్లో అన్ని శాఖల లక్ష్యాలు, సాధన ఆధారంగా పాయింట్లు కేటాయించారు. మొత్తం 685 సూచికలు ఉండగా.. కొన్ని నియోజకవర్గాలకు కొన్ని సూచికలు మాత్రమే వర్తిస్తాయి. లక్ష్యాలను చేరుకున్న తీరును బట్టి వాటికి స్కోర్ ఇచ్చి, గ్రేడ్‌లు కేటాయించారు. వివిధ రంగాలతో పాటు ఫిర్యాదుల పరిష్కారం, పీ4, అభివృద్ధి పనులను పరిగణనలోకి తీసుకున్నారు.

# టీటీడీ లడ్డు కేసులో హవాలా కోణం..

(మొదటి పేజీ తరువాయి)

దాచి, సరఫరా కొనసాగించేందుకు కొందరు అధికారులు సహకరించారని ౫౫ పేర్కొన్నట్టు తెలుస్తుంది. కొన్ని సందర్భాల్లో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని కూడా అనుమతించినట్టు ఆరోపణలు ఉన్నాయి.

ఇక, ఎస్ఐటీ నివేదిక ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా సంపాదించిన డబ్బును ఎలా మళ్లించారు, ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది, ఏ హవాలా ఏజెంట్ల ద్వారా తరలించారు అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. త్వరలోనే సంబంధిత వ్యక్తులు, సంస్థలకు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావించే తిరుమల లడ్డూ వ్యవహారంలో ఇలాంటి ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యవహారం టీటీడీ ప్రతిష్ఠకే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందు భక్తుల భావోద్వేగాలను కూడా దెబ్బతీసే ఛాన్స్ ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఈ కేసులో విచారణ వేగవంతం చేయనుండగా, రాబోయే రోజుల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

## చిల్లరలో దాగిన చరిత్ర... తరాలకు అందిస్తున్న

# ఓ తల్లి సంకల్పం



ఖానీ... అణా... పరక... పైసా...

ఒకప్పుడు మన జీవన భాగమైన ఈ పదాలు నేడు పిల్లల చెవికి కొత్తగా వినిపిస్తున్నాయి. వాటి అర్థం తెలుసుకోవాలంటే పుస్తకం కాదు, తాతమ్మ కథలు కాదు... గూగుల్‌ని అడగాల్సిన పరిస్థితి. అటువంటి తరంలో, ఆ నాణేల వెనుక దాగి ఉన్న కాలాన్ని, సంస్కృతిని భవిష్యత్ తరాలకు కాపాడాలనే మౌన సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.. అక్కయ్యపాలేనికి చెందిన ఉప్పల జగదాంబ. కాలం మారినా, కరెన్సీ రూపం మారినా, వాటితో ముడిపడిన జ్ఞాపకాలు చెరిగిపోకూడదన్న ఆలోచనతో ఆమె పాత కరెన్సీ నాణేలు, నోట్లను సేకరిస్తున్నారు. దేశీయ కరెన్సీతో పాటు విదేశాలకు చెందిన రూకల్ని కూడా ఎంతో శ్రద్ధగా భద్రపరుస్తున్నారు. చిన్ననాటి నుంచే కరెన్సీ సేకరణపై ఆసక్తి ఉన్న తనకు, భర్త రేపాక నాగరాజు, పిల్లలు విజయ్, శ్వేత అండగా నిలిచారని జగదాంబ చెబుతారు. అమెరికా, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల కరెన్సీని కూడా సేకరించి, ఇంటికి వచ్చే ప్రతి ఒక్కరికీ చూపిస్తూ కరెన్సీ వెనుక ఉన్న కాలాన్ని వివరిస్తుంటారు. ప్రత్యేకంగా నేటి తరం పిల్లలకు డబ్బు విలువ మాత్రమే కాదు, దాని చరిత్ర, ప్రయాణం కూడా తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఇంటివద్దే ఒక 'కరెన్సీ లైబ్రరీ'ని ఏర్పాటు చేశానని జగదాంబ తెలిపారు. రేపటి తరానికి నిన్నటి జ్ఞాపకాలను అందించడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని దేశాలకు చెందిన కరెన్సీని సేకరించి, అందరికీ అందుబాటులో ఉండే ప్రదర్శన ఏర్పాటు చేయాలనే ఆశ తనలో ఉందని చెప్పారు.



# అసమానతలను రాజేయనున్న ఏఐ

దావోస్‌లో ఇటీవల జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో చర్చించిన ప్రాథమికాంశాలలో 'కృత్రిమ మేధ (ఏఐ)-- దాని ప్రభావం' కూడా ఉంది. ఏఐని ఆశ్రయించక తప్పని ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా దాన్ని అనుసరించడంలో మందగమనంతో సాగవచ్చు నేమోకానీ, ఏదో ఒకనాడు దాన్ని అక్కున చేర్చుకోక తప్పదు. ఏఐని ఆశ్రయించడం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి; అదే సమయంలో... అటు కంపెనీలు, ఇటు ప్రభుత్వాలలో కొన్ని ఆందో ళనలున్నాయి.

### 'ఫోరమ్' సర్వే ఏం చెబుతోంది?

ఆర్థికవేత్తలలో ఫోరమ్ ఈ అంశంపై నిర్వహించిన సర్వే కొన్ని ఆసక్తికరమైన ఫలితాలను వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న ఉద్యోగాల్లో కొన్నింటి స్థానాన్ని ఏఐ ఆక్రమిస్తుందని దాదాపు 54 శాతం మంది అంగీకరించారు. కంపెనీలు ఏఐని ఎక్కువ వినియోగించు కుంటే లాభాల మార్జిన్లు పెరుగుతాయని సుమారు 45 శాతం మంది నమ్ముతున్నారు. అంటే, కంపెనీల సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు. జనాభాలోని కొన్ని వర్గాలకు వ్యతిరేకంగా ఇది వివక్షకు దారితీయవచ్చని 21 శాతం మంది భయాలు వ్యక్త పరిచారు.

వివిధ రంగాల పరిశ్రమల సామర్థ్యం ఏఐతో మెరుగుపడుతుందని మన దేశంలోనూ దాదాపుగా ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏఐని ఎక్కువ వినియోగించుకోవడం వల్ల అన్ని కంపెనీల్లో కస్టమర్ సర్వీస్ విభాగం సేవలు మెరుగుపడతాయి. ఆ విభాగం చాట్ బాట్స్‌ను సృష్టించుకోవడం వల్ల వినియోగదారులు ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. సామర్థ్యాన్ని పెంచుకునేందుకు దాదాపు అన్ని సేవా రంగాల పరిశ్రమలూ అటువంటి సాధనాలను ఉపయోగించుకోవడం ప్రారంభించాయి. కస్టమర్లకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు రిటైల్ కస్టమర్లతో ప్రమేయమున్న అన్ని వ్యాపార సంస్థలూ ఏఐని ఆశ్రయించక తప్పదు.

### కీలక రంగాల్లో ఏఐ వినియోగం

బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా రంగంలో రుణ యోగ్యతను మదింపు చేసేందుకు ఏఐని వినియోగిస్తున్నారు. రుణం కోరుతున్న కంపెనీకి చెందిన మొత్తం సమాచారాన్ని ఏఐ సమీకరించి, తిరిగి చెల్లించగల సామర్థ్యంపై అంచనాలు అందివ్వగలదు. కలన గణితాలను ఆధారం చేసుకుని, ఏ మేరకు రుణం మంజూరు చేయవచ్చునో, ఎంత వడ్డీ వసూలు చేయవచ్చునో తెలుపుతుంది. ముందే నిర్ణయించిన సూచికలను ఆధారం చేసుకుని ఆ కంపెనీ ఎగవేయడానికి ఏమైనా అవకాశం ఉందా అని కూడా చెప్పగలుగు తుంది. ఏఐ వినియోగం వల్ల మోసాన్ని కనిపెట్టడం తేలిక. ఫలితంగా, ఆ రంగానికి ఎంతో మేలు చేసినదవుతుంది.

ఐటీ రంగంలో ఇప్పటికే పెక్కు మార్పులు కనిపిస్తున్నాయి. మొత్తం కోడింగ్ ప్రాసెస్, ప్రోగ్రామింగ్ పనిని ఏఐకి అప్ప గిస్తున్నారు. ఈ కంపెనీలు సూచిస్తున్న పరిష్కారాలు క్లయింట్లకు ఉపయోగపడుతున్నాయి. ఆ క్లయింట్లు ఏఐ వినియోగంతో హెచ్చు సామర్థ్య స్థాయులతో తమ ప్రాజెక్టులను వేగవంతం చేసుకుంటు న్నారు. రిటైల్ రంగంలో, కస్టమర్ సంబంధ మాడ్యూల్ మొత్తాన్ని ఏఐ ద్వారా ప్రోగ్రామింగ్ చేస్తున్నారు. అది ఉత్పత్తులను సమర్థంగా డెలివరీ చేసేందుకు ఉపయోగపడుతోంది. స్టోరుకు వెళ్ళే వినియోగ దారుల ఇష్టాలు, అభిరుచుల సమాచారం మొత్తాన్ని ఏఐ క్రోడీక రిస్తోంది. వాటికి తగ్గట్లుగా ఆ యా ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం తేలికవుతోంది. ఆరోగ్య రక్షణ రంగంలో సప్లై చెయిన్ నిర్వహణను ఏఐ సమకూరుస్తోంది. ఏ వ్యాపార రంగానికైనా ఏఐ వినియోగం అనివార్యంగా మారుతోందనీ, దాన్ని ఉపయోగించు కోవడం వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయనీ వీటివల్ల స్పష్ట మవుతోంది.

కంపెనీలు భవిష్యత్తుకు తగ్గట్లుగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకునేందుకు కూడా క్రమేపీ ఏఐని ఆసరా చేసుకుంటు న్నాయి. ఏఐ సాధనాలు అందించిన ఇన్‌పుట్ల ఆధారంగా వ్యూహాలు రచించుకుంటున్నాయి. బడ్జెట్ తయారు చేసుకునేటప్పుడే ప్రత్యర్థి సంస్థల నుంచి ఎదురుకాగల పోటీని అంచనా వేసుకోగలుగు తున్నాయి. కాకపోతే, ఏఐని ఒక టెక్నాలజీగా వినియోగించుకోవడం చౌక కాదు. విద్యుచ్ఛక్తి ఎక్కువ అవసరమవుతుంది. గ్లోబల్ డేటా సెంటర్ విద్యుత్ వినియోగం 2035 నాటికి 1,200 టెరావాట్--గంట లను మించిపోవచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ అంచనా వేసింది. అంటే, 2024 స్థాయులకన్నా దాదాపు మూడింతలు ఎక్కువ. ఏఐ వృద్ధికి సమాంతరంగా విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని పెంచు కోవాలి. అయితే, ముమ్ముందు ఈ వ్యయాలు తగ్గుతాయనీ, లాభాలు పెంచుకునే వీలుంటుందనీ కంపెనీలు భావిస్తున్నాయి. ఖర్చుల మాట అట్టేపెట్టినా, మన దేశంలో పరిస్థితులు ఎలా మార తాయన్నది చూసుకోవాలి.

### దేశ కార్మికశక్తికి సవాల్


మనది మిగులు కార్మిక ఆర్థిక వ్యవస్థ. ఉద్యోగాల అవసరం ఉన్నవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. నిపుణులైనవారు తక్కువ సంఖ్యలో ఉన్నారు. నైపుణ్యం పెద్దగా అవసరం లేని లాజిస్టిక్స్, నిర్మాణ రంగాలు ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. నిర్దిష్ట నైపుణ్యాలు ఉన్నవారు దొరకడం ఒక సవాల్.

ఏఐ వినియోగాన్ని పెంచుకుంటున్న కంపెనీలు ఇపుడున్న సిబ్బందిని తిరిగి నిపుణులుగా తయారు చేయడంపై దృష్టి పెట్టాలి. లేదంటే వారిని గాలికి వదిలేసినట్లు అవుతుంది. అయితే, కొత్తగా నైపుణ్యాలను నేర్పించడానికి వయసు ఒక ప్రధాన సమస్యగా పరిణమిస్తోంది. కనుక, ఉద్యోగాలు కోల్పోయేవారి సంఖ్య పెరిగి తీరుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలో వివిధ కోర్సుల పాఠ్య ప్రణాళికల్లో ఏఐని అంతర్భాగం చేయడం వల్ల కొత్తగా ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే మాట కూడా నిజం. ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్నవారికి మాత్రం కోతల బెడద తప్పకపోవచ్చు. సర్వేలో వెల్లడైన రెండవ పెద్ద అంశం-- అసమానత. పెద్ద సంస్థలు పెట్టుబడులు పెట్టి, ఏఐ నిచ్చెనమెట్లు ఎక్కేస్తాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల ఆర్థిక స్తోమత అంతంత మాత్రంగా ఉంటుంది కనుక, అది వాటికి సాధ్యం కాని పని. ఇది ఆ రెండింటి మధ్య వ్యత్యాసాన్ని మరింత పెంచుతుంది. కొన్ని సంస్థలు పోటీ పడలేక రంగం నుంచి వైదొలగక తప్పని స్థితి ఏర్పడవచ్చు. ఈ అసమానత సమస్య సిబ్బందికి కూడా వర్తిస్తుంది. అవస రమైన నైపుణ్యం ఉన్నవారికి వెంటనే ఉద్యోగాలొస్తాయి. మామూలు ఉద్యోగాలలో కంటే ఎక్కువ జీతభత్యాలు లభిస్తాయి. మిగిలిన రంగాలవారి కన్నా ఐటీ రంగం ఎక్కువ జీతభత్యాలు ఇవ్వజూప గలగడం ఇప్పటికే చూస్తున్నాం. ఏఐ విషయంలోనూ అదే జరుగు తుంది. వస్తూత్పత్తి నుంచి కస్టమర్ సర్వీస్ వరకు వివిధ సంస్థలు తమ కార్యకలాపాలకు అవసరమైన చట్రాలను డిజైన్ చేయగలిగిన ఏఐ నిపుణులకి ఎక్కువ జీతాలు ఇవ్వజూపుతాయి.



సినాదం
నిఖార్సైన జర్నలిజం
ఫిబ్రవరి 11
బుధవారం 2026


# ఘనంగా సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



నాదస్వర కచేరీలు చేస్తున్న నిష్ణాతులైన కొంతమంది నాదస్వర డోలు కళాకారులను సంస్థ తరపున ఘనంగా సత్కరించి వారి సంగీత సేవలను కొనియాడారు . ఈ కార్యక్రమంలో కొణతాల రాజు , డాక్టర్ డాక్టర్ వై బాలగణేష్ , నాదస్వర డోలు కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ భీమారావు , కార్యదర్శి ఎన్ శ్రీను కోశాధికారి ఎం బాలరాజు , సంక్షేమ సంఘం ప్రతినిధులు వివిధ సాంస్కృతిక సంస్థల అధినేతలు సంగీత కళాభిమానులు పాల్గొన్నారు .

**విశాఖపట్నం (ప్రతినిధి):**

విశాఖ నగర శ్రీ మారుతి నాయి బ్రాహ్మణ నాదస్వర డోలు కళాకారుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ద్వారకానగర్ శంకరమఠంలో సద్గురు శ్రీ త్యాగరా స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి . ఈ ఉత్సవాలను సంగీత విద్వాంసులు ఇంద్రగంటి ఖాళీ ప్రసాద్ రమణి దంపతులు , ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వీ రాజశేఖర్ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ మాట్లాడుతూ వాగ్గేయకార వైభవానికి సద్గురు శ్రీ త్యాగరాజ స్వామివారు ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు . ఆధ్యాత్మిక జీవన విధానం ద్వారా పరమాత్మను సేవించుకునేందుకు శ్రీ త్యాగరాజ స్వామి వారి సంకీర్తనలు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు . సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సంగీత జనకలం ప్రతినిధి ఐ కాళీప్రసాద్ నేతృత్వంలో వారి శిష్యబృందం త్యాగరాజు స్వామి సంకీర్తనలతో పంచరత్న సేవ చేశారు . అనంతరం విశాఖ మరియు వివిధ ప్రాంతాలకు చెందిన నాదస్వర కళాకారులు త్యాగరాజ స్వామి వారి సంకీర్తనలతో నాదస్వర కచేరీలు నిర్వహించారు . పై కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను సంక్షేమ సంఘం తరపున ఘనంగా సత్కరించి కళాకారులకు కృతజ్ఞతలు తెలిపారు . నగరానికి చెందిన పలు దేవాలయాల ద్వారా

# జివిఎంసి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 95 వినతులు

## జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 95 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరం లో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, పి.నల్లనయ్య లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 95 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 01, మధురవాడ జోన్ కు 12, ఈస్ట్ జోన్ కు 15, వెస్ట్ జోన్ కు 07, నార్ట్ జోనుకు 22, సౌత్ జోన్ కు 10, పెందుర్తి జోన్ కు 02, గాజువాక జోన్ కు 13, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 13 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఒ అకౌంట్సు విభాగమునకు 06, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 09, పట్టణ ప్రణాళిక విభాగమునకు 52, ఇంజినీరింగు విభాగమునకు 13, మొక్కల విభాగమునకు 02, యుసిడి విభాగమునకు 02 కలిపి మొత్తంగా 95 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ పి వి సత్యనారాయణ రాజు,వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి వాసుదేవ రెడ్డి,డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసీపీ లు, ఏసీపీ లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు, యు సి డి ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. ప్రసన్న వాణి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శాంతి కుమారి,రీజనల్ ఫైర్ ఆఫీసర్ కృపావరం, ఎస్టేట్ ఆఫీసర్ పి.సన్యాసినాయుడు, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం (ప్రతినిధి):**

**ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ టెక్నికల్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, జీవీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ కె. వెంకటేశ్వరరావు సారధ్యంలో సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ కె.ప్రభాకర్ రావు, అదనపు కమిషనర్ డివి రమణమూర్తి, మరో డిప్యూటీ సిటీ ప్లానర్ టీ జి రామ్మోహన్ రావు, ఎసిపి వెంకట్రావు, అసోసియేషన్ సభ్యులు తేజేశ్వరరావు లు టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ డైరీ ని, క్యాలెండర్ ను ఆవిష్కరించారు.**

ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల కృషిని కొనియాడారు. పట్టణాల సుందరీకరణకు, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చెందేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు చేస్తున్న కృషిని కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రణాళికాయుతంగా భవనాలకు అనుమతుల నిస్తూ విశాఖ నగర అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు.



# శరవేగంగా శంఖు చక్ర నామాలు ఏర్పాటు పనులు



**బుచ్చియ్యపేట,విలేకరి**

వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఎల్ఈడీ శంఖు,చక్ర,నామాల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.ప్రస్తుతం పునాది కాంక్రీట్ వర్క్ జరుగుతోంది. మరో రెండు రోజుల్లో ఇది పూర్తయి ఐరన్ వర్క్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.మంగళవారం జడ్పిటిసి దొండా రాంబాబు నిర్మాణ పనులను పరిశీలించారు.

రూ.6లక్షల అంచనా వ్యయంతో కొండపై శాశ్వతంగా శంకు చక్ర నామాలు ఏర్పాటుకు గ్రామ పెద్దలు నిర్ణయించి దాతలు నుండి విరాళాలు సేకరిస్తున్నారు.వచ్చే నెల ఫిబ్రవరి 26 నుండి మార్చి 4వ తేదీ వరకు వెంకటేశ్వర స్వామి 153వ వార్షిక కళ్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభానికి ముందే ఇక్కడ శంఖు,చక్ర,నామాలు నిర్మాణం పూర్తి చేసేందుకు వెంకటేశ్వర వర్తక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు,యువకులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.శ్రీవారి శంఖు చక్ర నామాలు ఏర్పాటు చేయడం ద్వారా వెంకన్న ఆలయం మరింత ప్రాచుర్యం పొందుతుందని పలువురు భావిస్తున్నారు.ఈ నిర్మాణానికి భక్తుల నుండి ఊహించని విధంగా విశేష స్పందన లభిస్తుందని వర్తక సంఘం సభ్యులు తెలిపారు.

# మొక్కలు పెంపకం సామాజిక బాధ్యత




**బుచ్చియ్యపేట, విలేకరి**

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం అని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి,జడ్పిటిసి దొండా రాంబాబు అన్నారు.వెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న వడ్డాది గిరిజాంబగిరిలో మంగళవారం మొక్కలను నాటారు.తన సొంత నిధులతో 4500 మొక్కలను తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలో,రోడ్లు డివైడర్లలో నాటించారు.నాటిన మొక్కలను సంరక్షించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిరిజాంబగిరి ప్రాంగణాన్ని స్వచ్ఛదనం పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడం,వాటిని సంరక్షించడం ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు.భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని ఆస్తిగా ఇవ్వాలన్నారు.అవకాశం ఉన్నంత వరకు ప్రతి ఒక్కరు ఏదో ఒక సందర్భంలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో వర్మ,ఎంపీటీసీ కోరుకొండ రమణ, గుమ్మడి ప్రసాదు,అయ్యన్న దొర, మురళి, చింతల శంకర్రావు,వీర్ల సురేష్, మనోహర్,నాయుడు, పెంటకోట ప్రసాద్, జి శ్రీను, విఆర్పి గోవింద తదితరులు పాల్గొన్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# బడ్జెట్‌లో అంగన్వాడీలకు నిధులు పెంచాలని వినతి



నర్సీపట్నం (ప్రతినిధి):

2026-2027 బడ్జెట్‌లో నిధులు పెంచాలని, అంగన్వాడీల వేతనాల పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ చట్టం అమలు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో మంగళవారం నర్సీపట్నంలోని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ 2026-2027 కేంద్ర బడ్జెట్‌లో 26లక్షల మంది అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌తో సహా దాదాపు కోటి మంది స్కీమ్ వర్కర్ల దుస్థితి, హక్కులపై మాట్లాడకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. 2026-2027 సంవత్సరానికి అంగన్వాడీ పోషణ్ 2.0 కోసం బడ్జెట్ కేటాయింపులు రూ.23100 కోట్లు, గత ఏడాది బడ్జెట్ రూ.21960 కోట్లు అన్నారు. ఈ బడ్జెట్ సాధారణంగా కార్మికుల గురించి, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం స్కీమ్ వర్కర్ల పని పరిస్థితులను మెరుగుపరిచే విధంగా బడ్జెట్ కేటాయించాలని, అంగన్వాడీ వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మంగతాయి, ప్రెసిడెంట్ సిహెచ్.భ్రమరాంబ, అధ్యక్షులు లక్ష్మీ పాల్గన్నారు.

## ఈనెల 22న సాగర సంగ్రామ దీక్షను జయప్రదం చేయాలి



బుచ్చియ్యపేట, విలేకరి

ఈనెల 22న విశాఖలో జరుగుతున్న సాగర సంగ్రామ దీక్షని విజయవంతం చేయాలని ఎపిటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ కోరారు. మంగళవారం బుచ్చయ్యపేటలో సాగర సంగ్రామ దీక్ష పోస్టర్ను విడుదల చేశారు.

8సంవత్సరాలుగా సిపిఎస్ రద్దుకై ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం సీపీఎస్ ను రద్దు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సిపిఎస్ ని రద్దుచేసి ఒపీఎస్ ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, ఏపీసిపిఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షులు కోరుకొండ సతీష్, మండల శాఖ అధ్యక్షులు శేషు, ప్రధాన కార్యదర్శి మధు కృష్ణ, జిల్లా సబ్ కమిటీ సభ్యులు బి.దేముడు బాబు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈ నెల 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు



అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండల కేంద్రంలో వెలుగు ఆఫీస్ వద్ద ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని సోమవారం పోస్టర్ ఆవిష్కరణ చేశారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మికులకు హాని కలిగించే నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని ఉపాధి కూలీలు వ్యవసాయ కార్మికులు అనేక కార్మిక సంఘాలు చేస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని విఓఎల సంఘం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

### ఏయూలో ప్రారంభమైన కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం యూజీసీ సహకారంతో ఎంఎంటిటి ఆధ్వర్యంలో నిర్వహణ




ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం (ప్రతినిధి):

భారతీయ సాంప్రదాయ ప్రాచీన జ్ఞానాన్ని భవిష్యత్ తరానికి అందించడం ఎంతో అవసరమని ఏయూ సంస్కృత విభాగం విశ్రాంత ఆచార్యులు జి.ఏ శర్మ అన్నారు. సోమవారం ఏయూ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో ఇంటిగ్రేషన్ ఆన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (ఐకెఎస్) ఇన్ కరికులం అంశంపై నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సత్యాన్ని తెలుసుకోవడమే జ్ఞానమన్నారు. ప్రాచీన విధానంలో ఉన్న అంశాలను తెలుసుకోవడానికి భాష వారధిగా నిలుస్తుందన్నారు. సంస్కృతంలో ఉన్న అనేశ శాస్త్రీయ అంశాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని, భాష పద స్వరూపం విశిష్టతను తెలియజేశారు. ఇటువంటి కార్యక్రమాల వలన మన భారతీయ జ్ఞాన సంపదపై మనకి గౌరవం పెరుగుతుందన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏయూ అధికారులకు, సహకారం అందిస్తున్న యూజీసీని అభినందించారు.

విద్యమంత్రిత్వ శాఖ యూజీసీ-ఆర్థిక సలహాదారు సుదీప్ సింఘ్ జైన్ మాట్లాడుతూ 2023 సంవత్సరం నుంచి భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే 8 వేల మందికి టీచర్లను, 200 మంది మాస్టర్ ట్రైనర్లను, వెయ్యి మంది పరిశోధకులు ఈ రంగంలో శిక్షణ అందించామన్నారు. వచ్చే సంవత్సరం నుంచి 35 ప్రత్యేక కోర్సులను నిర్వహించే ప్రతిపాదన ఉందన్నారు. ఇప్పటికే 64 పరిశోధన

ప్రాజెక్టులను సైతం పూర్తిచేసామన్నారు. పరిశోధనలకు రూ 5 నుంచి 25 లక్షల రూపాయల వరకు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. వైవిధ్యమైన అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు.

ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ వేద గణితంలో ఉన్న పలు గణిత సూత్రాలు చిన్నవిగా ఉంటాయని, వాటి విశ్లేషణ ఎంతో నిఘూఢంగా ఉంటుందన్నారు. భాష తెలిస్తే వీటిని సరళంగా, విపులీకరించడం సాధ్యపడుతుందన్నారు. దేశానికి నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరమని, అదే సమయంలో ప్రాచీన సాంప్రదాయ జ్ఞానాన్ని బద్రపరచడం, భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో కీలకమన్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థను మరింత విస్తృతం చేయడం, విద్యలో భాగం చేయడానికి ఈ కార్యక్రమం ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు.

మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సంచాలకులు ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ ఆరు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కార్యక్రమం ప్రాధాన్యత, నిర్వహణ విధానం తదితర అంశాలను వివరించారు. జాతీయ విద్య విధానంలో ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని బోధన, అభ్యసన, పరిశోధనల్లో భాగం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అతిథులను సత్కరించారు.

# పరిశ్రమలకు అవసరమైన పరిశోధనలు విశ్వవిద్యాలయాలు జరపాలి

### ఐడిఎస్పిఎస్ ఛైర్మన్ డాక్టర్ రావు తుమ్మల



ఆంధ్రవిశ్వవిద్యాలయం, విశాఖపట్నం ( ప్రతినిధి):

పరిశ్రమలకు అవసరమైన పరిశోధనలు విశ్వవిద్యాలయాలు జరపాలని, తద్వారా దేశ ఆర్థిక అభివృద్ధికి పరిశోధనలను ఉపయుక్తంగా నిలపడం సాధ్యపడుతుందని గ్లోబల్ సెమికాన్ ఎక్స్పర్ట్, ఇండియన్ డిజైన్, సెమీకండక్టర్, ప్యాకేజింగ్ అండ్ సిస్ట్స్ (ఐడిఎస్పిఎస్) చైర్మన్ డాక్టర్ రావు తుమ్మల అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ప్రిన్సిపాల్స్, డీన్న్లు ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, పరిశోధనలలు చేయడంతో పాటు పరిశ్రమలకు ఉపయుక్తంగా నిలచే పరిశోధనలు జరిపే దిశగా విశ్వవిద్యాలయాలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా పరిశ్రమల వికాసం, ప్రగతి వేగవంతం కావడం, దేశ ఆర్థిక పరిపుష్టికి విశ్వవిద్యాలయాల పరిశోధనలు ఉపయుక్తంగా నిలవడం జరుగుతుందన్నారు. మానుఫాక్చరింగ్ రగంలో భారత్ కంటే చిన్న దేశాలు ముందుంటున్నాయని, వీటికి కారణాలను వివరిస్తూ భవిష్యత్తులో భారత్ సెమీకండక్టర్ రంగంలో మరింత మెరుగైన ప్రగతి చూపడానికి అవకాశాలు వివరించారు.

ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ ఏయూలో పూర్వ విద్యార్థుల సహకారంతో సెమీకండక్టర్ ల్యాబ్, రీసెర్చ్, పీజీ కోర్సులను నిర్వహించడానికి ఇటీవల అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందని వివరించారు. ఈ ప్రక్రియలో విలువైన సూచనలు, మార్గదర్శకం అందించాలని కోరారు. విశ్వవిద్యాలయం తరపున సత్కరించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.కింగ్ ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎం. శశి, ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య జి. గిరిజ శంకర్, ఆచార్య ఆర్.పద్మశ్రీ, డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం డాక్టర్ రావు తుమ్మల ఏయూ అల్గారిథం భవనం సమావేశ మందిరంలో ఎమర్జెన్స్ ఆఫ్ ఇండియన్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ- ద రోల్ ఆఫ్ ఎకడమియా అనే అంశంపై ప్రసంగించారు.డిజైన్ నుంచి ప్రొడక్ట్ తయారీ వరకు పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా కృషిచేస్తున్నామన్నారు. ఇతర దేశాలలో ఒక ఆలోచన కార్యరూపం దాల్చడానికి, వస్తువుగా మార్కెట్లో ప్రవేశించడానికి తక్కువ సమయం పడుతోందని, భారత్లో దీనికి ఎక్కువ సమయం పడుతోందన్నారు. దీనిని నివారించడానికి విభిన్న సంస్థలు, వ్యవస్థలు కలిసి పనిచేయాలని సూచించారు. భారత దేశ సామర్థ్యాలు అనంతమని చెప్పారు.

భారతీయ సెమీకండక్టర్ రంగం ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ లక్ష్యాలు వివరించారు. ఈ రంగంలో యువత, ఆచార్యుల సహకారాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎం. శశి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య వి. వల్లీ కుమారి తదితరులు ప్రసంగించారు.

సినాదం
నిఖార్సైన జర్నలిజం


# క్రికెట్ గ్రౌండ్‌ను ప్రారంభించిన కొప్పిశెట్టి



నక్రీడలు మానసిక ఉల్లాని
ాన్ని అందిస్తాయని పాయకరావుపేట నియోజకవర్గ దేశంపార్టీకన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. మంగళవారం నక్కపల్లి మండలం, రాజయ్యపేట గ్రామంలో ఎస్.ఆర్.ఆర్. ప్రైవేట్ కంపెనీ ఆర్థిక సహాయంతో నిర్మించిన క్రికెట్ గ్రౌండ్‌ను వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో యువత క్రీడల సాధన చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించడం ఎంతో అవసరమన్నారు.

రాష్ట్ర హోంశాఖమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలమేరకు ఎస్.ఆర్.ఆర్. కంపెనీ రాజయ్యపేటలో క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి ముందుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యానికి వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కురందాసు నూకరాజు, నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, మండల దేశంపార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, జిల్లా మత్స్యశాఖ సంఘ అధ్యక్షుడు గోసల పెద తాతారావు తదితర్లు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి గెలుపుకు కృషి చేయాలి



వి మాడుగుల విలేకరి

మాడుగుల మండలం తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం జరిగింది శాసనసభ్యులు బండారు సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల లక్ష్యంగా కూటమి పార్టీలతో కలిసి గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలని పార్టీ తీర్మానించింది.

మై టీడీపీ యాప్ ప్రతి కార్యకర్త ఉపయోగించాల్సిందిగా, సోషల్ మీడియాను ఫాలో అవ్వాలి అని, కేడర్ సంక్షేమం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా పలు సేవలు గురించి తెలియజేయడం జరిగింది. ముఖ్యమంత్రి సహాయ నిధి గురించి ప్రజలకు తెలియజేసి వాళ్ళని ఆదుకోవాల్సిందిగా కోరడం ఐనది సూపర్ సిక్స్ పథకాలు గురించి నిరంతరం ప్రజలలోకి తీసుకొనివెళ్ళవాల్సిందిగా కోరడం ఐనది అలాగే పార్టీ ప్రోటోకాల్ కూడా పాటించాలని పేర్కొన్నారు. ప్రతి నెల 5న ఈ విధంగా గ్రామ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయవలసిందిగా కోరడం అయినది.

# యూపీఐ ద్వారా పీఎఫ్ ఉపసంహరణ కోసం..

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులు, తమ ఈపీఎఫ్‌లో ఉన్న సొమ్మును యూపీఐ పేమెంట్ గేట్‌వే ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లోకి ఉపసంహరించుకునే సదుపాయం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అందుబాటులోకి రానుంది. ఇందుకోసం సరికొత్త ఈపీఎఫ్ఓ మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈపీఎఫ్‌లో కొంత భాగం మినహా మెజారిటీ వాటాను చందాదారులు తమ బ్యాంకు ఖాతాలోకి యూపీఐ ద్వారా ఉపసంహరించుకునే సౌలభ్యాన్ని తీసుకొచ్చే ప్రాజెక్టుపై కార్మిక శాఖ పనిచేస్తుంది. ఈపీఎఫ్ఓ సరికొత్త మొబైల్ యాప్‌ను తీసుకురానుందని, ఇందులో సభ్యులు యూపీఐ ద్వారా సొమ్మును వెనక్కి తీసుకోవచ్చని, పాస్‌బుక్ బ్యాలెన్స్ వంటి ఇతర సేవలను కూడా పొందొచ్చని వెల్లడించాయి. కొత్త మొబైల్





EPFO

యాప్‌లో బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసేందుకు ఎంత ఈపీఎఫ్ మొత్తం అందుబాటులో ఉంది అనే వివరాలను చందాదారులు తెలుసుకోవచ్చు.

చందాదారులు లావాదేవీలను పూర్తి చేయడానికి, వారి బ్యాంక్ ఖాతాలకు నిధులు భద్రంగా వెళ్లడానికి లింక్ చేసిన యూపీఐ పిన్‌ను వినియోగించాలి. సేవలను మెరుగుపరచడానికి, సాంకేతిక లోపాలను తొలగించడానికి ప్రస్తుతం 100 డమ్మీ ఖాతాలతో ఈపీఎఫ్ఓ ట్రయల్స్ నిర్వహిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ యాప్‌ను తీసుకొచ్చేందుకు కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది.

# వాట్సప్ వెబ్‌లో కొత్త ఫీచర్..
# యాప్ లేకుండానే కాల్స్




దిల్లీ: ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సప్ తన వెబ్ వెర్షన్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. కొత్తగా వాయిస్, వీడియో కాలింగ్ ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో యూజర్లు ఎలాంటి అదనపు సాఫ్ట్‌వేర్ ఉపయోగించకుండానే నేరుగా వెబ్ నుంచే ఆడియో/ వీడియో కాల్స్ చేసుకోవచ్చు. యూజర్లు వ్యక్తిగత చాట్ విండోలో కాల్ బటన్ కనిపిస్తుంది. కొద్దిమంది యూజర్లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

వాట్సప్‌లో ప్రస్తుతం ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడాలంటే.. మొబైల్ యాప్ ఉండాలి. ల్యాప్‌టాప్/ పీసీలపై పనిచేసేవారైతే వాట్సప్ విండోస్ లేదా మ్యాక్ వెర్షన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇప్పుడు వాట్సప్ వెబ్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి వస్తోంది. ఎవరికైనా కాల్ చేయాల్సివస్తే ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేకుండా ఇకపై నేరుగా కాల్స్ చేయొచ్చు. పరిమిత సంఖ్యలో యూజర్లకు తీసుకొచ్చిన ఈ సదుపాయం త్వరలో అందరికీ రానుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ మాదిరిగా వాట్సప్ వెబ్ నుంచి చేసే కాల్స్‌కు కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది.

# సీఎం పోస్టుకు డీకే..

## హైకమాండ్‌కు 80 మంది ఎమ్మెల్యేల రిక్వెస్ట్

**కర్ణాటక : కర్ణాటకలో సీఎం పోస్టుపై ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడేమో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను సీఎం చేయమని 80 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌కు అభ్యర్థన చేశారట. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం..**



"సీఎం పదవి విషయంలో డీకేకు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80-90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌ను అభ్యర్థించారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ. దానికి తగ్గట్టే మేం ప్రవర్తించాలి. ఆయన (యతీంద్ర సిద్ధరామయ్య) తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉంది. కానీ రాజకీయాల విషయానికి వస్తే.. క్రమశిక్షణే ముఖ్యం. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలని మా అందరి కోరిక. కానీ దానిగురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదు" అని ఇక్బాల్ మీడియాతో మాట్లాడారు.

మరోవైపు, డీకే దిల్లీకి వెళ్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం కానున్నాను. అయితే ఎవరిని కలుస్తాననే విషయం మాత్రం చెప్పలేను. మీరెందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు. నేను డిప్యూటీ సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నాను. దాంతో ఈ సమావేశాలు సర్వసాధారణమే. అలాగే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నాను" అని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎమ్మెల్యే ఇక్బాల్ వ్యాఖ్యల వేళ.. ఈ పర్యటన జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# హైవేపై విమానం ల్యాండింగ్..

## పలు వాహనాలు ధ్వంసం




**రద్దీగా ఉన్న హైవేపై విమానం ల్యాండ్ అవడంతో పలు వాహనాలు ధ్వంసమైన ఘటన అమెరికా (ఖు)లోని జార్జియాలో చోటుచేసుకుంది. సాంకేతిక లోపం తలెత్తిన సింగిల్ ఇంజిన్ శిక్షణ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు అమెరికా జాతీయ రవాణా భద్రతా బోర్డు అధికారులు వెల్లడించారు.**

ఈ ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు తెలిపారు. దీంతో రహదారిని మూసివేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో హైవేపై అనేక కార్లు ఉన్న సమయంలో ఒక్కసారిగా విమానం రోడ్డుపై ల్యాండ్ అయ్యి, వాటిని ఢీకొట్టినట్లు కనిపిస్తోంది.

గిల్మర్ మెమోరియల్ విమానాశ్రయం నుంచి కాంటన్‌లోని చెరోకీ కౌంటీ విమానాశ్రయానికి బయల్దేరిన కొద్దిసేపటికే విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించాడని అధికారులు తెలిపారు. ఫ్లైట్‌ను విమానాశ్రయానికి తీసుకువెళ్లడానికి తగినంత సమయం లేకపోవడంతో వెంటనే హైవేపై ల్యాండ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## క్యూబాకు విమానసర్వీసులు కొనసాగుతాయి

- మెక్సికన్ ఎయిర్‌లైన్స్





మెక్సికో సిటీ : క్యూబాకు షెడ్యూల్ ప్రకారం విమాన సర్వీసులు కొనసాగుతాయని మెక్సికన్ ఎయిర్‌లైన్స్ సోమవారం ప్రకటించింది. రెండు దేశాల మధ్య విమాన సర్వీసులు నిలిపివేయలేదని మెక్సికోలో క్యూబా రాయబారి యుజెనియో మార్టినెజ్ ఎన్రిక్వెజ్ పేర్కొన్నారు. "మెక్సికో నుండి క్యూబాకు విమాన సర్వీసులు నిలిపివేయలేదు. క్యూబాకు అనుసంధానంగా ఉన్న అన్ని విమానయాన సంస్థలు తమ విమానాలను షెడ్యూల్ ప్రకారం కొనసాగిస్తాయని ధృవీకరిస్తున్నాము" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. క్యూబా ప్రభుత్వం ఆదివారం అంతర్జాతీయ విమానయాన సంస్థలకు నోటీసు (నోటమ్) జారీ చేసిన అనంతరం ఈ పకటన వెలువడింది. యుఎస్ 'చమురు ముట్టడి' కారణంగా ఫిబ్రవరి 10 నుండి క్యూబా విమానాశ్రయాలలో విమాన ఇంధనం ఖాళీ అయిందని నోటీసులో పేర్కొంది. దీంతో నెలరోజుల పాటు మార్చి11వ తేదీవరకు దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు ప్రభావితం కానున్నాయని తెలిపింది. నోటీసుకు ప్రతిస్పందనగా, విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగించడానికి అత్యవసర చర్యలను చేపట్టాయి. తన విమానం రౌండ్-ట్రిప్ సర్వీసును పూర్తి చేయడానికి తగినంత ఇంధనాన్ని తీసుకుని మెక్సికో నుండి విమానం బయలుదేరుతుందని వివా ఏరోబస్ ప్రకటించింది. హవానా నుండి మాడ్రిడ్ వెళ్లే విమానాల్లో ఇంధనం నింపుకోవడానికి డొమినికన్ రిపబ్లిక్‌లో సాంకేతిక సిబ్బందిని నియమించనున్నట్లు స్పెయిన్‌కు చెందిన ఎయిర్ యూరోప్, ఐబీరియాలు తెలిపాయి. క్యూబాకు తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ఎయిర్ కెనడా ప్రకటించింది.

## ఇజ్రాయిల్ అధ్యక్షుడు పర్యటనకు వ్యతిరేకంగా ఆస్ట్రేలియాలో నిరసన ర్యాలీలు




కాన్‌బెర్రా : ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇస్సాక్ హెర్‌జాగ్ అధికారిక పర్యటనను ఖండిస్తూ ఆస్ట్రేలియాలో పలు నగరాల్లో వేలాది మంది సోమవారం (ఫిబ్రవరి 9) నిరసన ర్యాలీలు చేశారు. పాలస్తీనా యాక్షన్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలకు అధికారులు అనేక ఆంక్షలు విధించారు. అయినాసరే ఆంక్షల్ని అడ్డుకుని ఇజ్రాయిల్ అధ్యక్షుడి పర్యటనను ఖండిస్తూ వేలాది మంది పౌరులు ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. సిడ్నీలో పర్యటించనున్న హెర్‌జాగ్‌ని వెంటనే అరెస్టు చేయాలని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ దౌత్య ఆహ్వానాన్ని ఉపసంహరించుకోవాలని వీరు డిమాండ్ చేశారు. ప్రధానంగా సిటీ హాల్ స్క్వేర్‌లో గుమిగూడిన నిరసకారులను చెదరగొట్టడానికి మూడు వేలమందికిపైగా అధికారులు, సిడ్నీ పోలీసులు మోహరించారు. మరోవైపు ఇజ్రాయిల్ ప్రధానికి ప్రాతినిధ్యం వహించము అనే నినాదంతో వెయ్యి మందికిపైగా విద్యావేత్తలు, సామాజిక నేతలు సంతకం చేసిన లేఖను ఆస్ట్రేలియన్ యూదు కౌన్సిల్ ప్రచురించింది. ఇజ్రాయిల్‌లో నరమేధానికి పాల్పడుతున్న యూదుల చర్యల్ని ఆస్ట్రేలియన్ యూదు కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయిల్ అధ్యక్షుడిని అతిథిగా ఆహ్వానించడం ఆస్ట్రేలియా మానవ హక్కుల పట్ల ఉన్న నిబద్ధతను దెబ్బతీస్తుందని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ తెలిపింది.ఎకాగా, డిసెంబర్ 14 2025న సిడ్నీలోని బోండి బీచ్‌లో జరిగిన హనుక్కా కార్యక్రమంలో జరిగిన కాల్పుల్లో 15 మంది మృతి చెందారు. ఈ ఘటన తర్వాత ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఆహ్వానం మేరకు ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఈ వారంలో నాలుగురోజుల పాటు ఆస్ట్రేలియాను సందర్శిస్తున్నారు.

## స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం సమర్పించిన కాంగ్రెస్




న్యూఢిల్లీ : లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు మంగళవారం అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. తొలుత సభ మధ్యాహ్నం 2.00గంటల వరకు వాయిదా పడింది. సభ ప్రారంభమైన అనంతరం లోక్‌సభలో కాంగ్రెస్ చీఫ్ విప్ కోడికున్నిల్ సురేష్, పార్టీ విప్ మహ్మద్ జావేద్ అహ్మద్ అవిశ్వాస తీర్మానాన్ని సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్‌సింగ్‌కి అందజేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సి) ప్రకారం.. లోక్‌సభ సభ్యుడు స్పీకర్ తొలగింపు నోటీసును సెక్రటరీ జనరల్‌కు సుమారు 14రోజుల నోటీసుతో లిఖితపూర్వకంగా అందించవచ్చు. తీర్మానాన్ని సమర్పించిన అనంతరం కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోరు మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత (ఎల్ఒపి) రాహుల్‌గాంధీని అనేక సందర్భాల్లో మాట్లాడేందుకు అనుమతించకపోవడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. అనేక ప్రతిపక్ష పార్టీలు ఈ ఆందోళనకు మద్దతు తెలిపాయని అన్నారు. ఈ రోజు మధ్యాహ్నం 1.14 గంటలకు అవిశ్వాస తీర్మానాన్ని సమర్పించామని, 94(సి) నిబంధన ప్రకారం స్పీకర్ ఓంబిర్లాను తొలగించాలని కోరుతున్నామని అన్నారు. అవిశ్వాస తీర్మానంపై 119మంది సభ్యులు సంతకాలు చేశారు. వామపక్షపార్టీలు, కాంగ్రెస్‌తో పాటు ఆర్‌జెడి, సమాజ్‌వాది పార్టీ, డిఎంకెలు నోటీసుపై సంతకం చేశారు. అయితే తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు సంతకం చేసేందుకు నిరాకరించారు.ఎల్ఒపి రాహుల్‌గాంధీ కూడా సంతకం చేయలేదు. ఆయనను మాట్లాడేందుకు అనుమతించకపోవడం ప్రధాన అభియోగం. బిజెపి సభ్యుడు ఇద్దరు మాజీ ప్రధానులపై వ్యక్తిగత దాడులు చేశారని, ప్రతిపక్షాలు కోరినప్పటికీ స్పీకర్ ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని కూడా నోటీసులో పేర్కొన్నారు. ప్రధాని మోడీపై ఏదైనా ఊహించని చర్యకు పాల్పడే అవకాశం ఉందని తనకు కచ్చితమైన సమాచారం ఉందని స్పీకర్ సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకించింది. స్పీకర్ రాజ్యాంగ కార్యాలయాన్ని దుర్వినియోగం చేయడాన్ని సూచిస్తుందని నోటీసు తెలిపింది.

## ఢిల్లీలో క్షీణించిన గాలి నాణ్యతలు




న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యతలు క్షీణించాయి. ఇటీవలే అక్కడి వాతావరణం కొంత మెరుగు పడినప్పటికీ.. మంగళవారం ఢిల్లీలో ఎక్యూఐ స్థాయిలు క్షీణించాయి. ఢిల్లీలో ఎక్యూఐ స్థాయిలు 267 వద్ద నమోదయ్యాయి. దీంతో వీటి స్థాయిల్ని 'పూర్' కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) పేర్కొంది. కాగా, సిపిసిబి డేటా ప్రకారం ఢిల్లీలో ఆనంద్ విహార్ 317, బవానా 333 చాందినీ చౌక్ 280, ద్వారకా సెక్టార్ 8, 252, ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 192, నరేలా 277, పంజాబీ బాగ్ 277, ఆర్‌కె పురం 339, రోహిణి 335గా ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయి.

# సహజ గుణం




తెలుగులో ఇటీవల అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకం 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు'. దీనికంటే ముందు 'నా ఇష్టం', 'విజయానికి ఐదు మెట్లు' లాంటివి బెస్ట్ సెల్లర్స్. అత్యధిక పునర్ముద్రణలు పొందినవాటిల్లో 'మహాప్రస్థానం', 'వేయి పడగలు' లాంటివి ఉంటాయి. పోటీ పరీక్షలకు చదవాల్సి వచ్చేవో, ఉపవాచకాలుగా నిర్దేశించినవో కూడా మంచి అమ్మకాలే సాధిస్తాయి. కానీ ఇవన్నీ మినహాయింపులు మాత్రమే. సాధారణంగా తెలుగు సాహిత్యంలో బాగా అమ్ముడైన పుస్తకాలంటే వేసిన వెయ్యి కాపీలు మిగలకుండా పోయినవే! ఇప్పుడా వెయ్యా లేకుండా ఐదొందలు, మూడొందలు, ఆఖరికి వంద కాపీలు ముద్రించుకునే అవకాశం వచ్చింది. లక్ష కాపీలు అమ్ముడుపోవడం అనేది ఏ తెలుగు రచయితైనా కనే పగటి కల మాత్రమే. నిజంగానే లక్ష కాపీలు అమ్ముడైనా ఆ రచయితను మొత్తం తెలుగు జనాభాలో ఎంతమంది చదివినట్టు? సుమారు 0.1 శాతం! ఇలాంటి లెక్కల్నే ఆంగ్ల రచయితలకు అన్వయిస్తూ, "మీ పుస్తకాన్ని ఎవరూ చదవరు. ఇది అవమానించడం కాదు. ఇది లెక్కలపరమైన వాస్తవం" అంటారు పబ్లిషర్ స్టీఫెన్ స్పార్క్స్. ఆయన ప్రకారం, ఏ రచయిత వ్యాప్తి అయినా నామమాత్రమే. అందుకే గొప్పగా రాసివుండీ ఎవరూ చదవని రచయితల గురించి 'రైటర్స్ నో వన్ రీడ్స్' పేరుతో టంబ్లర్ పేజీ నడుపుతున్నాడు విల్ షోఫీల్డ్. ఈ రచయితలు గొప్ప రచయితలయ్యింది వాళ్ల అమ్మకాల వల్ల కాదు, వాళ్లది ఎంత ఒరిజినల్ రైటింగ్ అన్నదాన్నిబట్టి! "మరిచిపోయిన, నిర్లక్ష్యానికి గురైన, వదిలివేయబడిన, మరుగున పడిన, తక్కువగా అనువదింపబడిన రచయితలను వెలుగులోకి తేవడం..." అని షోఫీల్డ్ చెప్పింది తెలుగులోనూ చాలామంది రచయితలకు వర్తిస్తుంది. 'మహా వేధ' నవల రాసిన చివుకుల పురుషోత్తంను ఎవరైనా తలుచుకుంటున్నారా? కథకుడు అల్లం శేషగిరిరావుకు.. స్థాయికి తగిన గుర్తింపు ఉందా? తొలితరం యాక్టివిస్టు--రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మకు ఎన్ని విగ్రహాలు పెట్టారు? దళిత ఉనికితో కాకుండా నాగప్పగారి సుందర్రాజును గుర్తుచేసుకోవడం జరుగుతోందా? 'చెంఘిజ్‌ఖాన్'ను తెలుగు నేల మీద నిలబెట్టిన తెన్నేటి సూరికి ఎవరైనా హారతులు పడుతున్నారా? గుర్తింపు ఉన్న రచయితలు అనుకునేవాళ్లకు కూడా పెద్దలెక్కల్లో ఏ గుర్తింపూ లేనట్టే! ఇక అచ్చుకే 'నోచుకొని' రచయితల సంగతి? ప్రపంచ వ్యాప్తంగా విస్మరించలేని రచయిత అయిన ఫ్రాంజ్ కాఫ్కా రచనలు అతడు బతికివుండగా పెద్దగా అచ్చుకాలేదు. ఎమిలీ డికిన్సన్ కవిత్వమూ అంతే. 'నువ్వు లేని అద్దం' నవల ద్వారా కొత్త ఆసక్తికి కారణమైన చిత్రకొండ గంగాధర్ పుస్తకాలేవీ అతడు తన నలభైల్లో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు అచ్చుకాలేదు. మరి చదువుతారన్న గట్టి హామీ లేనప్పుడు కూడా రచయితలు ఎందుకు రాస్తున్నారు? వాళ్లను నడిపించే ఆ జీవలక్షణం ఏమిటి? "నా రచనకు ఆరంభ బిందువు ఎల్లప్పుడూ ఒక పక్షపాతం, ఒక అన్యాయ భావనే... నేను రాస్తాను-- ఎందుకంటే బయటపెట్టవలసిన ఏదో అబద్ధం ఉంటుంది, చూపించ వలసిన ఏదో నిజం ఉంటుంది" అంటాడు జార్జ్ ఆర్వెల్. "ప్రతి వ్యక్తి ఆత్మ తాలూకు వైశిష్ట్యాన్ని స్పష్టంగా చూపించటం నవలాకారుడి బాధ్యత అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అంటాడు హరూకీ మురకామి. "రచన నా శరీరానికి పొడిగింపు" అంటారు నటాలీ దయాజ్. "మనిషిగా ఉండే ఒక పార్శ్వాన్ని చూపించడం" కోసం రాస్తానంటాడు కజువో ఇషిగురో. కీర్తి కోసం అని విలియమ్ ఫాక్‌నర్ బోల్డుగా చెప్పేయొచ్చు; నాలుగు డబ్బుల కోసం అని ఇంకో రచయిత ఒప్పేసుకోవచ్చు. కానీ ప్రతి రచయితకూ భిన్న కారణం ఉంటుంది. అసలు ఏ కారణమూ ఉండకపోవచ్చు. 'సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు? చంద్రికలనేల వెదజల్లు చందమామ? ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు? ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?' అని కృష్ణశాస్త్రి అన్నట్టుగా-- రాయడం అనేది రచయిత సహజ లక్షణం. వాళ్లు రాయగలుగుతారు కాబట్టి రాస్తారు. రాయకుండా ఉండలేరు గనుక రాస్తారు. లోకం మీది ప్రేమతో దాన్ని జనానికి కానుక చేస్తారు.

# సాహసోపేతమేగానీ...



సహనం, ఓర్పు, సంయమనం, ప్రయామం, నిగ్రహం... ఎదుటివారు ఎంతగా రెచ్చ గొడుతున్నా మాట తూలకుండా ప్రశాంతంగా ఉండే స్థితిని చెప్పటానికి ఇలా బోలెడు పదాలున్నాయి. కనీసం ఆర్నెల్లుగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయినట్టేనని తరచు చెబుతూవచ్చారు. అందుకు మన దేశంనుంచి ఆశాజనకమైన స్పందన రానప్పుడల్లా రెచ్చిపోయి మాట్లాడారు. పాకిస్తాన్ పౌర, సైనిక అధినేతల్ని నెత్తినెక్కించుకుని రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. జమ్మూ--కశ్మీర్ భౌగోళిక చిత్రపటాన్ని పాకిస్తాన్ సంబరపడేలా మార్చేశారు. ఎన్ని చేసినా మన ప్రభుత్వం మౌనంగా ఉండిపోవటం, లేదా ఆచితూచి మాట్లాడటం పనికొచ్చినట్టుంది. ఎట్టకేలకు మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి భారత--అమెరికాల మధ్య ఒక అవగాహన కుదిరిందని మొన్న శనివారం అధికారికంగా ఉమ్మడి ప్రకటన వెలువడింది. అందుకు సంబంధించిన ఒక అమరిక (ఫ్రేమ్‌వర్క్) కూడా రూపొందింది. అంతే... వెనువెంటనే 25 శాతం అదనపు సుంకాలు రద్దయ్యాయి. ఇకపై సుంకాలు 18 శాతానికి మాత్రమే పరిమితమవుతాయని అమెరికా ప్రకటించింది. అంతర్జాతీయంగా భౌగోళిక, రాజకీయ అనిశ్చితి అలముకున్న తరుణంలో మన దేశం ఈ మాదిరి ఒప్పందానికి సంసిద్ధం కావటం ఒక సాహసోపేతమైన చర్య. అయితే 'ఇల్లలకగానే పండగ కాద'న్నట్టు ఈ ఒప్పందం వాస్తవ రూపం దాల్చేవరకూ ఒకింత ఉత్కంఠ, సంశయం తప్పవు. అటు తర్వాత కూడా దిన దిన గండం ఉండనే ఉంటుంది. అక్కడున్నది ట్రంప్ గనుకే ఈ సమస్య. ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వు గమనిస్తే ఇది తెలుస్తుంది. 'భారత్ ఇకపై రష్యా నుంచి చమురు కొనడం ఆపేసి, ఆ ఉత్పత్తులను అమెరికా నుంచే కొంటుందని ఆశిస్తున్నామ'ని అందులో ఉంది. భారత-- రష్యా చమురు వాణిజ్యంపై తమ నిఘా ఉంటుందని కూడా అంటున్నది. ఈ విషయంలో మన దేశం అధికారికంగా ఏమీ చెప్పలేదు. ఉమ్మడి ప్రకటనలోనూ ఆ ప్రస్తావ-నలేదు. కానీ జాతీయ ఇంధన ప్రయోజనాలే మన గీటురాయి అని గతంలో మోదీ అన్నారు. మన వ్యవసాయ, పాడి రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టే ప్రశ్నే లేదని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్ చెబుతున్నారు. అలాగే అమెరికా వ్యవసాయ, పాడి ఉత్పత్తులకు సుంకాలు తగ్గించబోమంటున్నారు. అయితే ఉమ్మడి ప్రకటనలో అమెరికాకు సంబంధించిన అన్ని పారిశ్రామిక సరుకులు, విస్తృతశ్రేణి ఆహార, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాల తగ్గింపు లేదా రద్దు చేయటానికి భారత్ అంగీకరించిందని ఉంది. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. లేనట్టయితే భారత్ వెనక్కి తగ్గిందని ట్రంప్ యాగీ చేయటంతోపాటు, అదనపు సుంకాలకు సాకుగా ఉపయోగించుకుంటారు. ప్రస్తుత భారత--అమెరికా వాణిజ్యం 13,000 కోట్ల డాలర్ల మేర ఉంది. ఇందులో అమెరికాకు మన ఎగుమతులు 8,500 కోట్ల డాలర్ల వరకూ ఉంటే, అమెరికా నుంచి దిగుమతులు 4,500 కోట్ల డాలర్ల వరకూ ఉన్నాయి. అంటే మనం 4,000 కోట్ల డాలర్ల వాణిజ్య మిగులులో ఉన్నాం. దీన్ని మార్చాలన్నదే ట్రంప్ తాపత్రయం. అందుకే వచ్చే అయిదేళ్లలో అమెరికా నుంచి 50,000 కోట్ల డాలర్ల విలువైన దిగుమతులుండేలా ఒప్పందం నిర్దేశిస్తోంది. ఇంధనం ఉత్పత్తులు, విమానాలు, విమాన విడిభాగాలు,సాంకేతిక ఉత్పత్తులు, అరుదైన లోహాల వంటివి ఉంటాయంటున్నారు. అంటే ఆ దేశంనుంచి ఏటా అదనంగా వందకోట్ల డాలర్ల అదనపు ఉత్పత్తులు వస్తాయి. అప్పుడు మన వాణిజ్య మిగులు ఆవిరై, లోటులో పడుతుంది. దీన్ని ఏ విధంగా సర్దుబాటు చేస్తారు కార్మికుల అవసరం ఎక్కువుండే మన ఉత్పత్తులకు ఒప్పందం వల్ల భారీ ప్రయోజనం కలిగే అవకాశమైతే ఉంటుంది. ఆ రకంగా దేశంలో ఉపాధి అవకాశాలు మెరుగవు తాయి. ఇక జన్యుమార్పిడి ఆహారం అనారోగ్యహేతువని, ఆ విత్తనాల వల్ల దిగుబడి భారీగా వచ్చినా, అవి వాడిన పంటపొలాల్లో భవిష్యత్తులో దేశీయ విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉండదని గతంలో భయాందోళనలు వ్యక్తమయ్యాయి. ఆ విషయంలో సందేహాలన్నీ నివృత్తి చేయాలి. అలాగే తుది ఒప్పందం సమయానికి అవసరమైన మార్పులు, చేర్పులకు ఇరుపక్షాలూ సిద్ధపడే షరతుపైనే ఏ ఒప్పందంపైనైనా సంతకం చేయాలి.

# వన్య ప్రాణుల వలస



ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన ఇళ్ల గడప వరకూ వచ్చేస్తున్నాయి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అడవులను నరికివేయడం, ఖనిజాల వెలికితీత పేరుతో బడా కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ సంఘర్షణ. వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అడవి ప్రదేశం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి- వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్క. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి అందరికి తప్పనిసరి, కానీ ఇది మనందరి ఆస్తి కాదు' అంటారు గాంధీజీ. కానీ, మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ... విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. తాజాగా తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు ఆరు రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం... మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల వేగవంతమైన క్షీణతకు దారితీస్తోంది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవిధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. 'ఒక ఆకు పడిపోతే ఆ మొక్క నొప్పి పడదా?' అంటారు రామకృష్ణ పరమహంస. అలాగే, ఒక చెట్టు పడిపోయినా ప్రకృతి నొప్పి పడుతుంది. ఇప్పుడు దేశానికి కావాల్సింది సానుభూతి కాదు- అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం. 'ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడాలి' అంటారు పర్యావరణవేత్త రఘుచంద్రన్. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు... బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ అసమతుల్యత ఏర్పడుతోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా... అధికారులకు తెలియజేయాలి. గ్రామాల్లో అవేర్‌నెస్ క్యాంపెయిన్లు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం...అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి.

# ఎన్నికలంటే.. డబ్బున్నోళ్ల దందా!



**ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థులదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది. పండగ చేసుకుంటున్నారు. ఇంట్లో వంటావార్పులు అంతంత మాత్రమే. రోజుకు ఎవరో ఒకరు రావడం సాయంత్రానికి దావత్ ఇవ్వడం పరిపాటిగా మారింది.**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గత వారం రోజులుగా ఇదే తంతు సాగింది. చివరకు బుధవారం ఎన్నికలు ఉండగా సాయంత్రం కూడా దావత్‌లకు టైమ్ కేటాయించారు. తాగుడు అలవాటు ఉన్నవారికి తాగినంత...తిండి అలవాటున్న వారికి తిన్నంత అన్న లెక్కన సాగడం ప్రజాస్వామ్య పరిహాసాని కి ఎన్నికలు పరాకాష్టగా నిలుస్తున్నాయి. సోమవారం సాయంత్రం మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ప్రలోభాలకు తెర లేచింది. మద్యం, మాంసంతో పాటు ఇతరత్రా కానుకల పంపిణీ ప్రారంభమైంది. పది రోజుల పాటు హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. ఆ వెంటనే కొందరు అభ్యర్థులు ఓటర్లపై తాయిలాలు వెదజల్లడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఓ పార్టీ నేతలు ఇంటింటికీ చికెన్ పొట్లాలు పంపించారు. మరో అభ్యర్థి తన వార్డు పరిధిలోని ఓటర్లకు హారతి ప్లేటెం పంపిణీ చేసారు. నామినేషన్ల పర్వం ముగిసిన వెంటనే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. దాదాపు పది రోజుల పాటు ప్రచారంతో హోరెత్తించాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. పట్టణాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం చేశారు. వందల మందిని వెంటేసుకుని గల్లీగల్లీ చుట్టేశారు. పార్టీల నేతలు వార్డుల వారీగా బాధ్యతలు పంచుకుని ఇంటింటికీ తిరిగారు. ప్రచార పర్వం ముగియడంతో అన్ని పార్టీల నేతలు ప్రలోభాలకు తెర లేపారు. ఉదయమే పోలింగ్‌కు సమయం దగ్గర పడడంతో విచ్చలవిడిగా తాయిలాలు వెదజల్లాయి.

చికెన్ వద్దు అన్నవారికి అరకిలో మటన్‌ను పంపించారు. గత రెండ్రోజులుగా మద్యం సీసాలు, కూల్‌డ్రింక్‌లు సరఫరా చేశారు. వీటికి అదనంగా రాత్రిపూట డబ్బుల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ప్రజలు చెవులు కొరుక్కున్నారు. ఒక్కో ఓటుకు రూ.1500 నుంచి రూ.3 వేలు ఇచ్చినట్లు సమాచారం. కొన్ని పట్టణాల్లో ఖరీదు కూడా పెంచారు. డివిజన్లు, వార్డుల్లో మద్యం ఏరులై పారుతుండగా, మరోపక్క డబ్బుల పంపకాలు జోరందుకున్నాయి. ఇక, ప్రత్యర్థి ఎంత పంచుతున్నాడు.. అని అంచనా వేస్తూ అంతకుమించి ఓటర్లను ఇవ్వటానికి ఎత్తులు వేయడంలో అభ్యర్థులు తలమునకల య్యారు. ఇలా యథేచ్ఛగా పంపకాలు జరుగుతున్నప్పటికీ అధికారుల దృష్టిలో మాత్రం పడలేదు. అయితే పరస్పరం ఆయా పార్టీల వారు మా÷-తరం ఆరోపణలు చేసుకున్నారు. ఫలానా పార్టీవారు డబ్బులు పంచుతున్నారంటూ నిందలు వేసారు. స్థానిక నేతల అండతో విచ్చలవిడిగా మద్యం, డబ్బులను పంపిణీ చేస్తుంటే, పోలీసులు వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ఒక ఎత్తయితే...ప్రత్యర్థి పార్టీల్లో నాయకులకు డబ్బు, మద్యం ఎరగా వేసి ఎన్నికల్లో గెలుపుకోసం మార్గాలు తయారు చేసుకుంటున్నారు. కోవర్టులను ఏర్పాట్లు చేసుకుని వారి ఎత్తులను చిత్తు చేయడానికి అభ్యర్థులు డబ్బులు ఆశ చూపుతు న్నారని సమాచారం. ప్రత్యర్థి అభ్యర్థితో ఉండే ముఖ్యమైన నాయకులు పార్టీ మారకున్నా సమాచారం చేరవేసి వారి ఓటమికి కృషి చేసే వారికి రూ. 50000 నుంచి రూ.లక్ష వరకు ముట్ట చెబుతున్నారని ప్రచారం జరుగుతోంది.

ఓటర్లనే కాకుండా ప్రత్యర్థి పార్టీల నాయకులను కూడా ప్రలోభాలకు గురి చేసి పార్టీలు మారడానికి వ్యూహాలు రచిస్తున్నారని తెలిసింది. మొత్తంగా మునిసిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగించారు. వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు గెలుపు టెన్షన్‌తో పాటు చైర్మన్ సీటు దక్కుతుందా అనే ఉత్కంఠలో ఉన్నారు. ప్రధాన పార్టీలు చైర్మన్ అభ్యర్థిని ప్రకటించకుండానే ఎన్నికల ప్రచారం లోకి దిగాయి. ఈ నేపథ్యంలో పురపాలికల్లో చైర్మన్ సీటుపై ఆశతో ఆశావహులు భారీగా ఖర్చు పెట్టారు. తన గెలుపుతో పాటు తన పార్టీకి చెందిన వార్డు సభ్యుల గెలుపుకు కూడా వారి భుజస్కంధాలపై వేసుకున్నారు. ఖర్చుకు వెనుకాడకుండా ఆశావహులు అన్నితామై వ్యవహరించారు. అయితే ఇన్నీ చేసిన చివరికి పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయా..? తానే పార్టీ అభ్యర్థిని అవుతానా అనే టెన్షన్‌లో ఆశావహులు ఉన్నారు. ఏదిఏమైనా ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎత్తులు, పైఎత్తులు పూర్తయ్యాయి. ప్రజలు ఎవరిని ఆదరిస్తారాఓ చూడాలి. గత సర్పంచ్ ఎన్నికల్లో డబ్బులు తీసుకుని ఓటేయలేదని నిలదీసారు. తమ డబ్బులు వాపస్ ఇవ్వాల ని నడిబజారులు పసుపుబయ్యింతో తిరిగారు. ఈ ఎన్నికల్లో అలాంటి విచిత్రాలు ఇంకా ఎన్ని చూడాల్సి వస్తుందో. ఓటర్ల మనసు ఎలా ఉం టుందో వేచి చూడాలి.

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- 3 వేల అదనపు బలగాలతో ఎన్నికల బందోబస్తు
- పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్
- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు
- డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి






**హైదరాబాద్, ఫిబ్రవరి10 :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని చెప్పారు. ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను ఎన్నికల బందోబస్తు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేశామన్నారు. ఓటర్లు భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నేపథ్యంలో 1,183 లైసెన్స్‌డ్ ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. 4,318 మందిని బైండోవర్ చేశాం. 398 నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేశాం. 4 రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో 55 చెక్‌పోస్టులు ఉన్నాయి. 181 ఫ్లయింగ్ స్క్వాడ్స్ సిద్ధం చేశాం. ఇప్పటివరకు రూ.3.09 కోట్లు స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాం. మహాదేవప్ప ఆత్మహత్య లేఖ రాయలేదని తెలిసింది. అయితే విచారణలో వివరాలు తెలుస్తాయని అన్నారు. హైదరాబాద్ ఎఫ్ఎస్ఎల్ ప్రమాదం ఎలా జరిగిందనేది విచారణ చేస్తున్నాం. ఏసీబీ కేసు 2015లో ఉన్న ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా అన్నీ పరిశీలించి నివేదికలు ఇచ్చాం. సాంకేతిక నిపుణులతో డేటాను రిట్రీవ్ చేస్తున్నాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు కాలిపోయాయనే అనుమానాల నేపథ్యంలో, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం, కేసుల విచారణ ఏ దశలో ఉందనే విషయాలపై ఆయన స్పష్టతనిచ్చారు. ఈ అగ్నిప్రమాదంలో ఎఫ్ఎస్ఎల్ లోని సర్వర్ రూమ్‌లు పూర్తిగా కాలిపోయాయని డీజీపీ వెల్లడించారు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, ఈ సర్వర్లకు ఎటువంటి బ్యాకప్ వ్యవస్థ అందుబాటులో లేదు. 'సర్వర్ రూమ్ పూర్తిగా దగ్ధమైంది. డేటా బ్యాకప్ లేకపోవడం వల్ల కొంత సమాచారం కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే, ప్రస్తుతం సాంకేతిక నిపుణుల బృందం రంగంలోకి దిగి, కాలిపోయిన సర్వర్ల నుండి డేటాను తిరిగి వెలికితీసే ప్రయత్నాలు చేస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కొన్ని కీలక కేసుల ఆధారాలు మాయమయ్యాయనే ప్రచారాన్ని డీజీపీ కొట్టిపారేశారు. ముఖ్యంగా 2015 నాటి ఏసీబీ కేసుల ఓటుకు నోటు వంటివి గురించి ప్రస్తావిస్తూ, ఆ కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను తాము 2021లోనే కోర్టుకు సమర్పించామని స్పష్టం చేశారు. అందువల్ల ఇప్పుడు జరిగిన ప్రమాదానికి, ఆనాటి కేసుల ఆధారాలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా ఆయన స్పందించారు. ఈ కేసులో కావాల్సిన అన్ని అంశాలను ఇప్పటికే నిశితంగా పరిశీలించామని, దానికి సంబంధించిన నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశామని తెలిపారు.



## మహాదేవప్ప మృతి బాధాకరం

**మంత్రి బెదిరింపులే కారణమన్న రామచంద్ర రావు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహాదేవప్ప ఆత్మహత్య ఘటన తీవ్రంగా కలచివేసిందని బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఇది అత్యంత భాధాకరమని.. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మహాదేవప్ప ఆత్మహత్యకు కాంగ్రెస్ అహంకారపూరిత రాజకీయాలు, మాఫియా బెదిరింపులే కారణంగా తెలుస్తోందన్నారు. స్థానిక మంత్రి శ్రీహరి, ఆయన అనుచరుల వేధింపులు తట్టుకోలేకే భాజపా అభ్యర్థి బలవన్మరణానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అధికార మత్తులో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోంది. అహంకారపూరిత రాజకీయ నాయకుడి వేధింపులకు నిండు ప్రాణం బలైంది. ఈ ఘటనకు కారణమైన మంత్రి శ్రీహరిని తక్షణమే అరెస్ట్ చేయాలి. ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగించాలి. ఈ ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాత విచారణ జరపాలి. లేనిపక్షంలో భాజపా కార్యకర్తల ఆగ్రహ జ్వాలలకు గురికాక తప్పదు. దోషులు ఎంతటి వారైనా వదిలిపెట్టకూడదు. మహాదేవప్ప కుటుంబానికి న్యాయం జరిగే వరకు భాజపా పోరాటం చేస్తుంది' అని రామచందర్‌రావు అన్నారు.

## ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేలు స్కూళ్లలో చదివే విద్యార్థులకు వరుస సెలవులు వచ్చాయి. ఎందుకంటే ఈ వారంలో వరుసగా నాలుగు రోజుల పాటు స్కూల్‌లకు సెలవులు ఉండే అవకాశం ఉంది. ఈ సెలవులు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం కొన్ని జిల్లాలో మాత్రమే ఉండనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోజు ఎన్నికల పక్రియలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూల్‌లకు సెలవులు ప్రకటించారు. దీంతో ఈసీ అధికారులు ఫిబ్రవరి 11న ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన ఒక రోజు తర్వాత రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు పక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపు పక్రియ అనేది పోలింగ్ జరిగిన ప్రాంతాల పరిధిలోని గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహించే స్కూల్‌లకు ఆరోజు అధికారులు సెలవులు ప్రకటించను న్నారు. ఈ పక్రియ ముగిసిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 14న రెండో శనివారం, ఫిబ్రవరి 15న ఆదివారం ఎలాగో హాలీడే కావడంతో వరుసగా రెండ్రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌లకు సెలవులు ఉండనున్నాయి. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ వారంలో నాలుగు రోజులు పాటు సెలవులు దొరకనున్నాయి.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారం

**సిట్ విచారణతో రంగంలోకి దిగిన ఈడీ**

**తిరుమల, ఫిబ్రవరి 10 :** శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారిం చనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

## బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు

**యువత తీరుపై సజ్జన్నార్ హెచ్చరికలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న యువతకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. నగరంలో యువకులు బైక్‌పై చేస్తున్న ప్రమాదకర విన్యాసాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నేపథ్యంలో సీపీ సజ్జన్నార్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. వాహనాలను బాధ్యతాయ-ుతంగా నడపాలని సూచించారు. బైక్ మీద చేసే ఈ చిత్రవిచిత్రమైన విన్యాసాలు చూడటానికి థ్రిల్లింగ్‌గా అనిపించవచ్చుని.. కానీ అవి క్షణాల్లో ప్రాణాలకు ముప్పు తెచ్చిపెడతాయని ఆయన హెచ్చరించారు. బైక్ మీద చేసే విన్యాసం.. నూరేళ్ల ఆయుష్షుకు వినాశనం అంటూ ఆయన పేర్కొన్నారు. చిన్న ప్రమాదం జరిగినా జీవితాంతం మంచానపడాల్సి వస్తుందని సీపీ అన్నారు. అంతేకాకుండా, మీ వల్ల ఇతరులు కూడా ప్రమాదాలబారిన పడొచ్చని తెలిపారు. సోషల్ మీడియాలో లైకులు, వ్యూస్ కోసం.. రోడ్డు మీద హీరోయిజం చూపించాలనే ఆశతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సజ్జనార్ సూచించారు. బైక్‌పై స్టంట్లు చేస్తూ వెనుక కూర్చున్న వ్యక్తుల ప్రాణాలను కూడా రిస్క్‌లో పెడుతున్న ఈ చర్యలు చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటి వల్ల కేసుల పాలై సమస్యలను కొని తెచ్చుకోవద్దని హెచ్చరించారు. 'బాధ్యతగా డ్రైవ్ చేయండి' అంటూ సీపీ సజ్జనార్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## మారుతీ కార్ల సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ప్రముఖ కార్ల కంపెనీ సర్వీస్ సెంటర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో పలు కార్లు దగ్ధమయ్యాయి. రాజేంద్రనగర్ మారుతీ సుజుకీ సర్వీస్ సెంటర్‌లో ఈ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భారీ అగ్ని ప్రమాదం కారణంగా పరిసరాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ప్రమాదంలో పలు కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని, మంటలను ఆర్పేశారు. ప్రమాదంలో ఆ ఎ÷-లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి.

## మహాదేవప్ప ఆత్మహత్యపై విచారణ చేయాలి

- మాఫియా రాజకీయాలతోనే ఆత్మహత్య
- కుటుంబ సభ్యులకు బిజెపి నేతల పరామర్శ



**మక్తల్, ఫిబ్రవరి 10 :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్య చేసుకొవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహాదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహాదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపి డికె అరు-ణతో కలసి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయించాలన్నారు. ఆత్మహత్యకు వేధింపులే కారణమని అన్నారు. ఇదిలావుంటే మహాదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని ఎంపి డికె అరుణ మండిపడ్డారు. 'ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. మహాదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

## శైవాలయాల్లో పెరుగుతున్న రద్దీ

- శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు
- మంత్రులు, అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి, ఫిబ్రవరి 10 :** శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో శివరాత్రి భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవ పరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ÷రిళిజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.



# స్టార్మర్ నెత్తిన 'ఎప్‌స్టీన్' పిడుగు..

## యూకే ప్రధాని రేసులో షబానా

**యూకే :** ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం బ్రిటన్‌లో మరోసారి రాజకీయ సంక్షోభానికి దారితీసింది. ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఒకవేళ స్టార్మర్ వైదొలిగితే యూకే తదుపరి ప్రధాని (ఖఖ్రావీ)గా ఎవరు ఎన్నికవుతారనే దానిపై చర్చ మొదలైంది. ఈ రేసులో మహిళా ఎంపీ షబానా మహ్మద్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అదే జరిగితే బ్రిటన్ చరిత్రలోనే పాక్ మూలాలు ఉన్న తొలి ముస్లిం ప్రధానిగా షబానా నిలవనున్నారు. షబానా మహ్మద్ ప్రస్తుతం స్టార్మర్ ప్రభుత్వంలో హోం మంత్రిగా కొనసాగుతున్నారు. 45 ఏళ్ల షబానా 2010 నుంచి బర్మింగ్‌హమ్ లేడీవుడ్ స్థానానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వృత్తిరీత్యా బారిస్టర్ అయిన ఆమె.. ఆ తర్వాత రాజకీయాల వైపు ఆసక్తితో లేబర్ పార్టీలో చేరారు. అనతికాలంలోనే పార్టీలో ఉన్నత పదవులకు చేరుకున్నారు. తన పార్లమెంట్ కెరీర్‌లో షాడో క్యాబినెట్‌లో స్థానం సాధించారు. యూకేలో ప్రభుత్వ మంత్రి మండలి నిర్ణయాలను పరిశీలించడం కోసం ప్రతిపక్షం ఏర్పాటుచేసుకునే సొంత క్యాబినెట్‌ను షాడో క్యాబినెట్‌గా పిలుస్తారు. లేబర్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో షాబా జస్టిస్ సెక్రటరీ, షాడో ఎడ్యుకేషన్ సెక్రటరీగా వ్యవహరించారు. 2025లో లేబర్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆమె హోం మంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. బ్రిటన్‌కు వలసవచ్చిన పాకిస్థానీ దంపతులకు 1980లో షబానా జన్మించారు. లేబర్ పార్టీలో బలమైన నేతగా ఇప్పటికే ఆమెకు పేరుంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్టార్మర్ వైదొలగాల్సి వస్తే.. పార్టీ పగ్గాలు అందుకునేందుకు ఆమె సమర్థవంతమైన నాయకురాలని లేబర్ పార్టీ నాయకులు భావిస్తున్నారు. లైంగిక నేరాల నిందితుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాలు ఉన్న పార్టీ సీనియర్ నేత మాండెల్సన్‌ను అమెరికాలో రాయబారిగా నియమించిన ప్రధాని కీర్ స్టార్మర్ పదవీగండాన్ని ఎదుర్కొంటున్నారు. ఎప్‌స్టీన్ ఫైళ్ల వ్యవహారం వెలుగులోకి రాగానే మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించినా స్టార్మర్‌పై విమర్శలు ఆగడం లేదు. ఆయన రాజీనామా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, ఈ విషయంలో తాను చివరివరకు పోరాడుతానని ప్రధాని విశ్వాసం వ్యక్తంచేస్తున్నారు. ప్రధానిగా స్టార్మర్ బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నరే అయింది.



# చర్చలొద్దు.. మా దేశంపై దాడి చేయండి

## ట్రంప్‌ను అభ్యర్థించి ఇరాన్ వ్యక్తి ఆత్మహత్య

**ఇరాన్ :** తమ దేశంతో అమెరికా చర్చలు జరపవద్దని కోరుతూ ఇరాన్‌కు చెందిన ఓ వ్యక్తి అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌ను అభ్యర్థించాడు. ఇరాన్‌పై అమెరికా దాడి చేయడమే సరైన మార్గమంటూ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. అనంతరం ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకొని చనిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. బాధితుడిని బుషెహర్ నగరానికి చెందిన హక్కుల కార్యకర్త పొరియా హమీదీగా గుర్తించారు. గతవారం అతడు 10 నిమిషాల వీడియోను విడుదల చేశాడు. అందులో అమెరికా ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశాడు. "ఈ వీడియోను మీరు చూసే సమయానికి నేను బతికి ఉండకపోవచ్చు. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలను ఎంత ఘోరంగా అణచివేశారో అంతర్జాతీయ సమాజానికి తెలియాలి. ఇక్కడ మారణహోమం జరిగింది. దాదాపు 40వేల మందిని మా నాయకులు హత్య చేశారు. విదేశీ జోక్యం లేకుండా ఇరాన్ నాయకత్వాన్ని అడ్డుకోలేం. ఇప్పుడు మా నమ్మకమంతా అమెరికా మీదే. అలా కాదని ఇరాన్‌తో అగ్రరాజ్యం చర్చలు జరిపితే.. మమ్మల్ని మోసం చేసినట్లే. ఇరాన్‌తో సంప్రదింపులు వద్దు. మా దేశంపై దాడి చేయండి" అని హమీదీ ఆ వీడియోలో అభ్యర్థించాడు. అయితే, ఈ వీడియో ఎప్పుడు విడుదల చేశాడు.. హమీదీ ఎలా చనిపోయాడన్న దానిపై స్పష్టత లేదు. ఇటీవల ఇరాన్‌లో జరిగిన ఆందోళనలు తీవ్ర హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. నిరసనకారులను అణచివేసే క్రమంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే, ఇరాన్ మాత్రం మరణాలపై అధికారిక సంఖ్య ఏదీ చెప్పలేదు. మరోవైపు, ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అగ్రరాజ్యం మోహరింపులు కూడా భారీగానే ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య



**మిమెన్‌సింగ్ :** బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గంపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఫిబ్రవరి 12న ఆ దేశంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరో హిందువు హత్యకు గురవడం చర్చనీయాంశంగా మారింది. మిమెన్‌సింగ్ జిల్లాలో సోమవారం సుసేన్ చంద్రశేఖర్ (62) అనే హిందూ వ్యాపారిని గుర్తు తెలియని దుండగులు కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం..సోమవారం రాత్రి చంద్రశేఖర్ తన బియ్యం దుకాణంలో ఉండగా లోపలికి చొరబడిన దుండగులు ఆయనపై కత్తితో దాడి చేశారు. దీంతో ఆయన అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వ్యాపారి మృతిచెందాడని ధ్రువీకరించుకున్న నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా దుకాణం షట్టర్‌ను మూసివేసి.. అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం దుకాణానికి వచ్చిన చంద్రశేఖర్ కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే వ్యాపారి హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. మరో రెండు రోజుల్లో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో హిందూ వ్యాపారి హత్యకు గురవడంతో ఆ దేశంలో హిందువుల భద్రత పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది

## పోలవరం ప్రాజెక్టుపై స్టాప్ వర్క్ ఆర్డర్

# ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి

- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ
- కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎఎ పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కరించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్- తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సీఎం పోస్టుకు డీకే..

## హైకమాండ్‌కు 80 మంది ఎమ్మెల్యేల రిక్వెస్ట్



**కర్ణాటక :** కర్ణాటకలో సీఎం పోస్టుపై ఎప్పటికప్పుడు ఊహాగానాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడేమోను సీఎం చేయమని 80 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌కు అభ్యర్థన చేశారట. తాజాగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ వెల్లడించడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. "సీఎం పదవి విషయంలో డీకేకు ఒక ఛాన్స్ ఇవ్వాలని 80-90 మంది ఎమ్మెల్యేలు హైకమాండ్‌ను అభ్యర్థించారు. ఇప్పుడు ఈ నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. మాది క్రమశిక్షణ కలిగిన పార్టీ. దానికి తగ్గట్టే మేం ప్రవర్తించాలి. ఆయన (యతీంద్ర సిద్ధరామయ్య) తండ్రికి అనుకూలంగా పదేపదే మాట్లాడటం ఇబ్బందిగా ఉంది. కానీ రాజకీయాల విషయానికి వస్తే.. క్రమశిక్షణే ముఖ్యం. తమ వ్యాఖ్యలతో ఇతరులను రెచ్చగొట్టాలని చూడటం సరికాదు. డీకేకు ఒక అవకాశం ఇవ్వాలని మా అందరి కోరిక. కానీ దానిగురించి బహిరంగంగా ప్రకటనలు చేసి, గందరగోళం సృష్టించకూడదు" అని ఇక్బాల్ మీడియాతో మాట్లాడారు. మరోవైపు, డీకే ఢిల్లీకి వెళ్తున్నారు. "కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశం కానున్నాను. అయితే ఎవరిని కలుస్తాననే విషయం మాత్రం చెప్పలేను. మీరెందుకు అంత ఆసక్తి చూపిస్తున్నారు. నేను డిప్యూటీ సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగానూ ఉన్నాను. దాంతో ఈ సమావేశాలు సర్వసాధారణమే. అలాగే కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నాను" అని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఎమ్మెల్యే ఇక్బాల్ వ్యాఖ్యల వేళ.. ఈ పర్యటన జరుగుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జపాన్‌లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రం పునఃప్రారంభం



**టోక్యో:** ప్రపంచంలోనే అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను జపాన్ సోమవారం పునఃప్రారంభించింది. గతంలో సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిన ఈ కర్మాగారం తిరిగి విద్యుదుత్పత్తికి సిద్ధమైంది. 2011లో సంభవించిన భారీ భూకంపం, సునామీ కారణంగా ఫుకుషిమా ప్లాంట్‌లో ప్రమాదం సంభవించింది. దీంతో దేశవ్యాప్తంగా అణు విద్యుత్ కేంద్రాలను జపాన్ ప్రభుత్వం మూసివేసింది. ఆ తర్వాతి పరిస్థితుల్లో.. శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావించింది. 2050 నాటికి 'కార్బన్ న్యూట్రాలిటీ' సాధించడానికి, కృత్రిమ మేధ (ఏఐ) అవసరాలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి మళ్లీ అణుశక్తి వైపు మొగ్గు చూపుతోంది. ఈ నేపథ్యంలో కాషివాజాకి-కరీవా ప్లాంట్‌ను పునఃప్రారంభించడానికి జనవరిలో మొదటిసారి ప్రయత్నించారు. అయితే, మానిటరింగ్ అలారం మోగడంతో ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఈ కర్మాగారంలోని ఒక రియాక్టర్ సోమవారం మధ్యాహ్నం 2:00 గంటలకు తిరిగి ప్రారంభమైనట్లు టోక్యో ఎలక్ట్రిక్ పవర్ కంపెనీ (టీఈపీసీఓ) ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చేనెలలో సమగ్ర తనిఖీ ముగిశాక ఈ ప్లాంట్‌లో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. ఈ కర్మాగారంలో మొత్తం ఏడు రియాక్టర్లు ఉన్నాయి.

# డీల్ కుదిరినా.. 1% టారిఫ్‌ల తగ్గింపే..

## అమెరికా-బంగ్లాదేశ్ ఒప్పందం



**యూఎస్ :** వ్రతం చెడ్డా.. ఫలం దక్కాలి అనేది సామెత.. కానీ, బంగ్లాదేశ్ విషయంలో దీనికి భిన్నంగా జరిగింది.. అమెరికాతో డీల్ కుదిరినా ఆశించిన ఫలం దక్కలేదు..! అమెరికా-బంగ్లాదేశ్ మధ్య సోమవారం వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీని ప్రకారం ఆ దేశంపై టారిఫ్‌లు 20 శాతం నుంచి 19 శాతానికి తగ్గనున్నాయి. సోమవారం అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్, బంగ్లా ప్రతినిధి షేక్ బషీరుద్దీన్ సంతకాలు చేశారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం ఓ ప్రకటనలో ధ్రువీకరించింది. ఈ ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ టెక్స్‌టైల్స్, అప్పెరల్స్ సరకులపై మినహాయింపులు పొందేందుకు వాషింగ్టన్ ప్రయత్నిస్తుంది. అయితే అమెరికాలో తయారైన కాటన్ ఉపయోగించేందుకు బంగ్లాదేశ్ అంగీకరించినట్లు ఆ దేశ సలహాదారు మహమ్మద్ యూనస్ స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. గతంలో బంగ్లాదేశ్‌పై ట్రంప్ 37 శాతం టారిఫ్‌లు విధించగా.. ఆ తర్వాత దానిని 20 శాతానికి తీసుకొచ్చారు. ఈ ఒప్పందం తర్వాత మరొక శాతం తగ్గించి 19 శాతం వద్ద స్థిరీకరించారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం 18 శాతం టారిఫ్‌ల వద్ద కుదరడంతో.. వస్త్ర పరిశ్రమ ఆధారిత ఆర్థికవ్యవస్థ అయిన బంగ్లాదేశ్‌లో కంగారు మొదలైంది. దీంతో దేశంలో ఎన్నికల వేళ భారత్ కంటే తక్కువ టారిఫ్‌లతో ఒప్పందం కుదుర్చుకొనేందుకు యత్నించింది. ఈ క్రమంలో అమెరికా పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, మెడికల్ పరికరాలు, ఆటోపార్టులు, ఇంధన ఉత్పత్తులకు బంగ్లాదేశ్ మార్కెట్‌ను తెరిచేందుకు అంగీకరించింది.



# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

## నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.




# హైవేపై విమానం ల్యాండింగ్..

## పలు వాహనాలు ధ్వంసం

**జార్జియా :** రద్దీగా ఉన్న హైవేపై విమానం ల్యాండ్ అవడంతో పలు వాహనాలు ధ్వంసమైన ఘటన అమెరికాలోని జార్జియాలో చోటుచేసుకుంది. సాంకేతిక లోపం తలెత్తిన సింగిల్ ఇంజిన్ శిక్షణ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు అమెరికా జాతీయ రవాణా భద్రతా బోర్డు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలైనట్లు తెలిపారు. దీంతో రహదారిని మూసివేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందులో హైవేపై అనేక కార్లు ఉన్న సమయంలో ఒక్కసారిగా విమానం రోడ్డుపై ల్యాండ్ అయ్యి, వాటిని ఢీకొట్టినట్లు కనిపిస్తోంది. లీ గిల్మర్ మెమోరియల్ విమానాశ్రయం నుంచి కాంటన్‌లోని చెరోకీ కౌంటీ విమానాశ్రయానికి బయల్దేరిన కొద్దిసేపటికే విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తినట్లు పైలట్ గుర్తించాడని అధికారులు తెలిపారు. ఫ్లైట్‌ను విమానాశ్రయానికి తీసుకువెళ్లడానికి తగినంత సమయం లేకపోవడంతో వెంటనే హైవేపై ల్యాండ్ చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# కెనడా-అమెరికా మధ్య వంతెనను బ్లాక్ చేస్తాం : ట్రంప్

**యూఎస్ :** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆ దేశాన్ని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్‌ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రంప్ కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవన్నారు. అగ్రదేశాన్ని కాదని.. చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారన్నారు. వంతెన ప్రాజెక్ట్‌కు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటు చేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్-డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది. దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే దీనిపై కెనడా ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సినాదం నిఖార్సైన జర్నలిజం

# విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్

మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.






# బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్-ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్రక్రియలో చిత్ర యూనిట్ ఉంది. భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.



# మనుషులుగా గుర్తించాలి

## కామాక్షి భాస్కర్ల

పొలిమేర ఫేమ్ కామాక్షి భాస్కర్ల సోషల్ మీడియాలో తనపై వచ్చిన ఒక అసభ్యకరమైన ప్రశ్నకు అత్యంత చాకచక్యంగా సమాధానం ఇచ్చి వార్తల్లో నిలిచింది. సాధారణంగా సెలబ్రిటీలు ఇలాంటి చిల్లర ప్రశ్నలను పట్టించుకోరు, కానీ కామాక్షి ఒక అడుగు ముందుకు వేసి సదరు నెటిజన్‌కు దిమ్మతిరిగే కౌంటర్ ఇచ్చింది. "అందమైన అమ్మాయిలు అసలు పూప్ చేస్తారా?" అని ఒక నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించిన తీరు ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. వృత్తిరీత్యా నటి మాత్రమే కాకుండా డాక్టర్ కూడా అయిన కామాక్షి ఈ ప్రశ్నకు స్పందిస్తూ.. "మా కడుపులు సిమెంట్, కాంక్రీటుతో తయారయ్యాయి. అందుకే మేము తినే ఆహారం అంతా మాయమైపోతుంది. అది నేరుగా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఉపయోగపడుతుంది" అంటూ తనదైన శైలిలో సెటైర్ వేసింది. సెలబ్రిటీలు కూడా సాధారణ మనుషులే అన్న విషయాన్ని మర్చిపోయి ఇలాంటి విడ్డూరమైన ప్రశ్నలు అడిగే వారికి తనదైన వ్యంగ్యంతో సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది. సైన్స్‌తో సంబంధం లేని ఇలాంటి ప్రశ్నలకు తన హాస్యం తోడైతేనే కరెక్ట్ అని ఆమె నిరూపించింది. అంతేకాకుండా ఈ వీడియోకు.. "కొన్నిసార్లు ఇంటర్నెట్ చాలా సీరియస్ ప్రశ్నలు అడుగుతుంటుంది. వాటికి సైన్స్ నుంచి సమాధానాలు ఆశిస్తుంది. కాస్త వ్యంగ్యం, కాస్త హాస్యం కలిపి చెప్పడం ద్వారా సెలబ్రిటీలు కూడా సాధారణ రక్తమాంసాలున్న మనుషులే అని గుర్తు చేయడానికే నేను ఇలా స్పందించాను" అని రాసుకొచ్చింది. ఇక కామాక్షి సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం 'మా ఊరి పొలిమేర-3' చిత్రంతో బిజీగా ఉన్న కామాక్షి, ఇలాంటి అసభ్యకర ప్రశ్నలను సున్నితంగా స్పందించడమే కాకుండా కౌంటర్ ఇవ్వడంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# అందుకే మా సినిమాకు 'ఏ' సర్టిఫికెట్

## 'కపుల్ ఫ్రెండ్లీ' నిర్మాత

హైదరాబాద్: ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న విడుదల కానున్న చిత్రాల్లో 'కపుల్ ఫ్రెండ్లీ' ఒకటి. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. టైటిల్ విషయంలో సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసిందని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని తెలిపారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా మంగళవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. "కపుల్ ఫ్రెండ్లీ.. అసభ్యకరంగా అనిపిస్తోందని చెప్పిన సెన్సార్ బోర్డు సినిమా పేరును మార్చుమని సూచించింది. 'ఫ్రెండ్లీ కపుల్' పేరు పెట్టమని సలహా ఇచ్చింది. ఒకవేళ మార్చకపోతే 'ఏ' సర్టిఫికెట్ ఇస్తామని చెప్పింది. 'కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ ఇప్పటికే ప్రేక్షకులకు చేరువైంది. విడుదల తేదీ సమీపిస్తుండగా ఇప్పుడు పేరు మార్చడం సరికాదని అనిపించింది. అందుకే టైటిల్‌ను ఛేంజ్ చేయకుండా 'ఏ' సర్టిఫికెట్ తీసుకున్నాం. అంతమాత్రాన ఈ సినిమాలో అసభ్యత ఉందని అనుకుంటే పొరపాటే. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ ఇది. ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉంటాయి. కేవలం టైటిల్‌ని బట్టి సినిమాని తప్పుగా అర్థం చేసుకోవడం కరెక్ట్ కాదు" అని ధీరజ్ వివరించారు. క్లిష్టమైన టైటిల్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందన్న ప్రశ్నపై సంతోశ్ శోభన్ స్పందించారు. "ఈ టైటిల్ ప్రేక్షకులకు రీచ్ అవుతుందా, లేదా? అని తొలుత నేనూ సందేహించా. కానీ, టీమ్‌కు నమ్మకం ఉంది. వారి వివరణతో నేను రిలాక్స్ అయ్యా. సినిమా ప్రారంభంలోనే టైటిల్‌కు జస్టిఫికేషన్ ఉంటుంది" అని అన్నారు.






# కొచ్చైడైయాన్ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు నోటీసులు

## యాడ్ బ్యూరోకు రెండున్నర కోట్లు చెల్లించాలని ఆదేశం

చెక్ బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా (తెలుగులో 'విక్రమసింహ') నిర్మాతకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యాడ్ బ్యూరో సంస్థకు నాలుగు వారాల్లో రూ. 2.5కోట్లు చెల్లించాలని లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ కథానాయకుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. దీపిక పదుకొణె కథానాయిక. ఈ సినిమా నిర్మాణ పనులకు బెంగళూరుకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో భాగంగా 2014లో మురళీమనోహర్ యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబిర్ చంద్ నహర్‌కు రూ. 5 కోట్ల చెక్ ఇచ్చారు. అది బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. మొదట ఈ కేసులో మురళీ మనోహర్‌కు ట్రయిల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇచ్చిన గడువులోపు యాడ్ బ్యూరో అడ్ట్వంల్గ÷జింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 2.5 కోట్లు చెల్లించాలని లేదంటే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదేశించింది.

# వాట్సప్ వెబ్‌లో కొత్త ఫీచర్.. యాప్ లేకుండానే కాల్స్




ప్రముఖ మేసేజింగ్ యాప్ వాట్సప్ తన వెబ్ వెర్షన్‌లో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చింది. కొత్తగా వాయిస్, వీడియో కాలింగ్ ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. దీంతో యూజర్లు ఎలాంటి అదనపు సాఫ్ట్‌వేర్ ఉపయోగించకుండానే నేరుగా వెబ్ నుంచే ఆడియో/ వీడియో కాల్స్ చేసుకోవచ్చు. యూజర్లు వ్యక్తిగత చాట్ విండోలో కాల్ బటన్ కనిపిస్తుంది. కొద్దిమంది యూజర్లకు మాత్రమే ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. వాట్సప్‌లో ప్రస్తుతం ఆడియో, వీడియో కాల్స్ మాట్లాడాలంటే.. మొబైల్ యాప్ ఉండాలి. ల్యాప్‌టాప్/ పీసీలపై పనిచేసేవారైతే వాట్సప్ విండోస్ లేదా మ్యాక్ వెర్షన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇప్పుడు వాట్సప్ వెబ్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి వస్తోంది. ఎవరికైనా కాల్ చేయాల్సివస్తే ఎలాంటి యాప్ డౌన్‌లోడ్ అవసరం లేకుండా ఇకపై నేరుగా కాల్స్ చేయొచ్చు. పరిమిత సంఖ్యలో యూజర్లకు తీసుకొచ్చిన ఈ సదుపాయం త్వరలో అందరికీ రానుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ మాదిరిగా వాట్సప్ వెబ్ నుంచి చేసే కాల్స్‌కు కూడా ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటుంది.






# గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి నిధుల వరద..

ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. జనవరి నెలలో నికరంగా రూ.24,028 కోట్లు మాత్రమే వచ్చాయి. అంతకుముందు నెలతో పోలిస్తే నిధుల ప్రవాహం 14 శాతం తగ్గుముఖం పట్టింది. ఈక్విటీల్లోకి పెట్టుబడులు తగ్గడం వరుసగా రెండో నెల. మార్కెట్ పరిస్థితులు, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించడం ఇందుకు కారణం. అదే సమయంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లలోకి భారీగా పెట్టుబడులు తరలిరావడం విశేషం. ఈ మేరకు మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ జనవరి నెలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. యాంఫీ డేటా ప్రకారం.. మ్యూచువల్ ఫండ్ల సంస్థల (ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ పెరిగింది. డిసెంబర్‌లో రూ.80.23 లక్షల కోట్లుగా ఉన్న ఈ విలువ రూ.81.01 లక్షల కోట్లకు చేరింది. మొత్తంగా మ్యూచువల్ ఫండ్స్ నుంచి డిసెంబర్‌లో రూ.66,591 కోట్ల నిధులు తరలిపోగా.. జనవరి నెలలో వివిధ కేటగిరీల్లో నికరంగా రూ.1.56 లక్షల కోట్ల నిధులు వచ్చాయి. ఈక్విటీ స్కీమ్స్‌లో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి రూ.7,672 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,185 కోట్లు, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ రూ.3,182 కోట్లు చొప్పున నిధులను ఆకర్షించాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,005 కోట్లు రాగా.. స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,942 కోట్లు నిధులొచ్చాయి. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్స్ నుంచి రూ.593.69 కోట్లు తరలిపోయాయి. మదుపర్ల నుంచి ప్రాఫిట్ బుకింగ్, ట్యాక్స్ సంబంధిత అడ్జెస్ట్‌మెంట్ల వల్ల ఈ పరిస్థితి నెలకొందని యాంఫీ పేర్కొంది. ఇదే నెలలో డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లోకి రూ.74,827 కోట్ల నిధులు వచ్చాయని తెలిపింది.

**గోల్డ్ రష్:** బంగారం ధరల్లో భారీ పెరుగుదల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు భారీగా తరలివచ్చాయి. డిసెంబర్ నెలలో రూ.11,647 కోట్ల పెట్టుబడులు గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రాగా.. జనవరిలో రూ.24,040 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. అంటే నెలవారీగా చూసినప్పుడు నిధులు రెట్టింపయ్యాయి. దాదాపు ఈక్విటీ పెట్టుబడులతో సమానంగా ఈ కేటగిరీలోకి నిధులు తరలివచ్చాయి.



# అమెరికాపై గెలిచిన పాకిస్తాన్

**కొలంబో :** కొలంబో వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు విజయం సాధించింది. అమెరికాపై 32 పరుగుల తేడాతో గెలిచింది. కొన్నిరోజుల క్రితం టీమిండియాపై అద్భుతంగా ఆడిన అమెరికా జట్టు.. ఇప్పుడు పాక్‌పై కూడా అదే జోరు ప్రదర్శించింది. కానీ గెలుపు రుచిచూడలేకపోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కి దిగిన పాక్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 190 పరుగుల స్కోరు చేసింది. ఫర్హాన్ 73 పరుగులతో ఆకట్టుకునే ప్రదర్శన చేశాడు. బాబర్ ఆజమ్ 46 పరుగులతో ఆకట్టుకున్నాడు. అమెరికా బౌలర్లలో షాడ్లీ 4 వికెట్లతో మంచి ప్రదర్శన చేశాడు. అనంతరం అమెరికా జట్టు.. దూకుడుతో ఛేదన మొదలుపెట్టింది. కానీ వరస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో నిర్ణీత ఓవర్లన్నీ పూర్తి చేసినప్పటికీ.. 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు మాత్రమే చేయగలిగింది. శుభం రంజనే 51, షయన్ జహంగీర్ 49 పరుగులతో మెప్పించారు. పాక్ బౌలర్లలో ఉస్మాన్ తారీఖ్ 3, షాదాబ్ ఖాన్ 2 వికెట్లు తీశారు.

# తోక ముడిచిన పాక్

## ఫిబ్రవరి 15న భారత్, పాకిస్తాన్ జట్ల పోరు



తప్పని పరిస్థితుల్లో పాకిస్తాన్ తోక ముడిచింది. మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా చివరికి తన నిర్ణయం మార్చుకోవలసి వచ్చింది. పాకిస్తాన్ ప్రభుత్వం తమ జట్టు టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడదని ఫిబ్రవరి 1న ప్రకటించింది. కొన్ని రోజుల హైడ్రామా తర్వాత, పాకిస్తాన్ జట్టు టీమిండియాతో మ్యాచ్ ఆడుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదట పాక్ కి 3 కండీషన్లు పెట్టింది. అయితే వాటిని అంగీకరించలేదు. దాంతో చివరికి పాకిస్తాన్ ప్రభుత్వం, పీసీబీ దిగి రావాల్సి వచ్చింది. ఇప్పుడు భారత్, పాకిస్తాన్ మ్యాచ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ ప్రేమికులు ఎదురుచూస్తున్నారు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఈ ఆసియా జట్లు గ్రూప్-ాలో ఉన్నాయి. భారత్ తన మొదటి మ్యాచ్‌లో అమెరికా (ఖూూ)ని ఓడించగా, నెదర్లాండ్స్‌తో జరిగిన తన మొదటి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించింది. పాకిస్తాన్ నెక్ట్స్ మ్యాచ్ అమెరికాతో తలపడనుంది. భారత్ గురువారం నాడు తమ రెండో మ్యాచ్ నమీబియాతో ఆడనుంది. తమ మూడవ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు ఢీకొంటాయి. మైదానం బయట మాటల తూటాలు పేల్చుతున్న పాక్ జట్టు మ్యాచులో ఏం చేస్తుంది, ఎలాంటి ప్రదర్శన చేస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది. టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్, పాకిస్తాన్ జట్ల పోరు 27వ మ్యాచ్ అవుతుంది. ఈ మ్యాచ్ ఆదివారం (ఫిబ్రవరి 15న) ఐసీసీ షెడ్యూల్ చేసింది. భారత్, పాక్ మధ్య మ్యాచ్ తటస్థ వేదికలో జరుగుతుంది. గత కొన్నేళ్లుగా పాక్ లో మ్యాచులు ఆడటం లేదు. అయితే ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ×జజ ఈవెంట్స్‌లో భారత్ లో మ్యాచ్‌లు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ తరువాత పాక్ జట్టు భారత్ రావడానికి నిరాకరిస్తోంది. భారత్ సైతం పాక్ తో స్వదేశంలో మ్యాచులకు సిద్ధంగా లేదు. టీ20 వరల్డ్ కప్ లో ఈ జట్లు తటస్థ వేదిక అయిన కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో జరుగుతుంది. ఈసారి పొట్టి ప్రపంచ కప్‌ను భారత్, శ్రీలంక జట్లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఫిబ్రవరి 15న టీ20 ప్రపంచ కప్‌లో మొత్తం 3 మ్యాచ్‌లు ఉన్నాయి. టీమిండియా, పాకిస్తాన్ మ్యాచ్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ రాత్రి 7 గంటలకు ప్రారంభమవుతుంది. టాస్ 6:30 గంటలకు వేస్తారు. భారత్, పాక్ మ్యాచ్ కనుక వీకెండ్ అందులోనూ ఆదివారం వచ్చేలా ఐసీసీ షెడ్యూల్ చేసింది. ఈ మ్యాచ్ బ్రేక్ 10 సెకన్ల యాడ్ సైతం ఐసీసీకి కోట్లలో ఆదాయం సమకూరుస్తుంది. భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ ఛానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. జియోహాట్‌స్టార్ యాప్, వెబ్‌సైట్‌లో భారత్, పాకిస్తాన్ టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ లైవ్ ఇస్తారు. రాత్రి 7 గంటలకు ఈ ఉత్కంఠభరిత పోరు ప్రారంభం కానుంది.



# ‘బాస్’ ఆల్‌రౌండ్ షో..

## పసికూనల పోరులో నెదర్లాండ్స్ గెలుపు

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా జరిగిన పోరులో పసికూనలు నెదర్లాండ్స్, నమీబియా తలపడ్డాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ పైచేయి సాధించింది. బాస్ డి లీడ్ ఆల్‌రౌండ్ మెరుపుల కారణంగా 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. లీడ్ తొలుత బంతితో (3-0-20-2), ఆతర్వాత బ్యాట్‌తో (48 బంతుల్లో 72 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సత్తా చాటి నెదర్లాండ్స్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. ఈ గెలుపుతో నెదర్లాండ్స్ ప్రస్తుత ఎడిషన్‌లో బోణీ కొట్టింది. ఈ జట్టు తొలి మ్యాచ్‌లో పాక్ చేతిలో ఖంగుతింది. మరోవైపు నబీమియాకు ఇదే తొలి మ్యాచ్. తొలి మ్యాచ్‌లోనే ఆ జట్టు పరాజయంపాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జాన్ ఫ్రైలింక్ (30), జాన్ నికోల్ లాఫ్టీ ఈటన్ (42) ఓ మోస్తరు స్కోర్లు సాధించి నమీబియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించారు. మిగతా బ్యాటర్లలో జేజే స్మిట్ (22), కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (18) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. నెదర్లాండ్స్ బౌలర్లలో లొగన్ వాన్ బీక్, బాస్ డి లీడ్ తలో 2 వికెట్లు పడగొట్టగా.. ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాస్సెన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. అనంతరం ఓ మోస్తరు లక్ష్యాన్ని నెదర్లాండ్స్ సునాయాసంగా ఛేదించింది. బాస్ డి లీడ్ అజేయమైన మెరుపు ఇన్నింగ్స్‌తో ఆ జట్టును విజయతీరాలకు చేర్చాడు. లీడ్‌తో పాటు కొలిన్ ఆకెర్‌మన్ (32), మైఖేల్ లెవిట్ (28), స్కాట్ ఎడ్వర్డ్స్ (18 నాటౌట్) కూడా రాణించడంతో నెదర్లాండ్స్ 18 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. నమీబియా బౌలర్లలో బెర్నార్డ్ స్కోల్జ్, రూబెన్ ట్రంపెల్మన్, నికోల్ లాఫ్టీకి తలో వికెట్ దక్కింది.

# న్యూజిలాండ్ ఓపెనర్ల ఊచకోత



టీ20 వరల్డ్‌కప్ 2026లో న్యూజిలాండ్ జట్టు వరుస విజయాలతో దూసుకుపోతుంది. తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన ఈ జట్టు.. తాజాగా (ఫిబ్రవరి 10) యూఏఈపై 10 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో యూఏఈ నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని ఓపెనర్లే ఊదేశారు. ఫిన్ అలెన్ (50 బంతుల్లో 84 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్సర్లు), టిమ్ సీఫర్ట్ (42 బంతుల్లో 89 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) ఊచకోత ధాటికి న్యూజిలాండ్ కేవలం 15.2 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యంగా నిలిచింది. సీఫర్ట్-అలెన్ దెబ్బకు యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు. వీరిద్దరు పడ్డ బంతిని పడ్డట్టు ఎడాపెడా బాదారు. అలెన్ కాస్త నిదానంగా ఆడినా, సీఫర్ట్ మాత్రం బౌండరీలు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. విన్నింగ్ రన్స్‌ను కూడా సీఫర్ట్ సిక్సర్‌తోనే సాధించాడు. అలెన్ తన హాఫ్ సెంచరీని 27 బంతుల్లో పూర్తి చేస్తే, సీఫర్ట్ కేవలం 23 బంతుల్లోనే పని కానిచ్చేశాడు. ఫలితంగా ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనూ సీఫర్ట్ ఇదే తరహా విధ్వంసం (42 బంతుల్లో 65; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) సృష్టించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. సీఫర్ట్ ధాటికి ఆ మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 17.5 ఓవర్లలోనే ఛేదించింది. సీఫర్ట్ విధ్వంసకర ఫామ్ చూస్తుంటే, ఈ ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను ఆపడం కష్టమేమో అనిపిస్తుంది. అతనికి ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, డారిల్ మిచెల్, మార్క్ చాప్‌మన్ లాంటి బ్యాటర్లు తోడైతే, బ్యాటింగ్‌కు స్వర్గధామమమైన ఉపఖండపు పిచ్‌లపై న్యూజిలాండ్‌ను ఆపడం కష్టమే. బ్యాటింగ్ విషయాన్ని పక్కన పెడితే, ప్రస్తుత న్యూజిలాండ్ జట్టు బౌలింగ్‌లో మరింత ప్రమాదకరంగా ఉంది. ఆ జట్టులో డఫీ, హెన్రీ, ఫెర్గూసన్, నీషమ్ లాంటి ప్రమాదకర ఫాస్ట్ బౌలర్లు ఉన్నారు. అలాగే స్పిన్ విభాగంలో మిచెల్ సాంట్నర్ లాంటి టాప్ స్పిన్నర్ ఉన్నాడు. ఈ గెలుపుతో గ్రూప్-డి నుంచి న్యూజిలాండ్ సూపర్-8 బెర్త్ దాదాపుగా ఖరారైనట్లే.

### అసాధారణ ప్రదర్శన

ఈ మ్యాచ్‌లో యూఏఈ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ జట్టు బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన కనబర్చారు. పటిష్టమైన న్యూజిలాండ్ బౌలింగ్ లైనప్‌ను ఎదుర్కొని నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేశారు. టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో యూఏఈకి ఇదే అత్యధిక టీమ్ స్కోర్. కెప్టెన్ ముహమ్మద్ వసీం (66 నాటౌట్), అలీషాన్ షరాఫు (55) కలిసి యూఏఈకి ఈ రికార్డు స్కోర్ అందించారు. ఆఖర్లో మయాంక్ కుమార్ (21) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 2 వికెట్లు తీయగా.. డఫీ, ఫెర్గూసన్, సాంట్నర్, ఫిలిప్స్ తలో వికెట్ తీశారు.

### బెంబేలెత్తిపోయిన యూఏఈ బౌలర్లు

174 పరుగుల లక్ష్య ఛేదనను న్యూజిలాండ్ ఓపెనర్లు ఆచితూచి ప్రారంభించారు. అయితే వీరిద్దరు క్రమంగా గేర్ మార్చి వీలు చిక్కనప్పుడల్లా యూఏఈ బౌలర్లును ఉతికి ఆరేశారు. వీరి ధాటికి రోహిద్ ఖాన్ 3.2 ఓవర్లలో 51 పరుగులు, జునైద్ సిద్దిఖీ 4 ఓవర్లలో 47 పరుగులు, అర్ఫాన్ 3 ఓవర్లలో 36 పరుగులు సమర్పించుకున్నారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ (4-0-27-0) ఒక్కడు కాస్త పొదుపుగా బౌలింగ్ చేశాడు. మొత్తంగా టిమ్ సీఫర్ట్, ఫిన్ అలెన్ ధాటికి యూఏఈ బౌలర్లు బెంబేలెత్తిపోయారు.



## భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధిస్తే..

# క్రికెట్ మ్యాచ్ గెలిచేది

### పీయూష్ గోయల్

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్, యూఎస్ఏ మ్యాచ్‌కు సుంకాలను ముడిపెడుతూ కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. క్రికెట్ మ్యాచ్ గెలిచేదని అన్నారు. భారత్-అమెరికా మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఖీూ) అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. భారత్ ఉత్పత్తులపై సుంకాలను అగ్రరాజ్యం 18 శాతానికి తగ్గించింది. ఈ డీల్ నేపథ్యంలో భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఇచ్చిన విందుకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఎస్ఏ టీమ్‌కు విజయం దక్కకపోయినా.. ఆట తీరు అద్భుతం. క్రికెట్ గురించి పెద్దగా తెలియకపోయినా.. కొన్నేళ్లక్రితమే ఆటను మొదలుపెట్టిన ఈ జట్టు మెరుగైన ప్రదర్శన చేసింది. సెర్గియో ఈ గేమ్‌ను బాగా ఎంజాయ్ చేశారు. 18 శాతం సుంకాలు విధించకపోయి ఉంటే.. గెలిచి ఉండేవాళ్లమని అప్పుడు సెర్గియో అనుకొని ఉంటారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక సూచన చేస్తున్నాను. భారత్‌పై అమెరికా జీరో టారిఫ్‌లు విధించి ఉంటే.. మీ టీమ్ మ్యాచ్ గెలిచిఉండేది. ఏదేమైనప్పటికీ.. అమెరికా జట్టు ప్రదర్శన చూసి నేను ఆశ్చర్యపోయాను” అని గోర్‌ను ఉద్దేశించి మంత్రి అన్నారు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా శనివారం రాత్రి భారత్, యూఎస్ఏ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌తో ఆతిథ్య భారత్ శుభారంభం చేసింది. ముంబయి వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాపై 29 పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరివరకు పోరాడినా యూఎస్ఏ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయింది. యూఎస్ఏ జట్టు ఆటతీరుకు ప్రశంసలు దక్కాయి.

నినాదం
నిఖార్సైన జర్నలిజం

# టోర్నమెంట్ మధ్యలో స్టార్ ప్లేయర్‌ను ఇంటికి పంపేసిన యూఏఈ..

## కారణం భారత్, పాక్ సమస్యేనా?

**న్యూజిలాండ్‌తో తమ ప్రచార ప్రారంభ మ్యాచ్‌కు ముందు, యూఏఈ ఓ స్టార్ ప్లేయర్‌ను ఇంటికి పంపేసింది. దీనిక కారణం 'క్రమశిక్షణా సమస్యలు' అంటూ చెప్పుకొచ్చింది. పూర్తి వివరాలు త్వరలో చెబుతామంటూ సోషల్ మీడియాలో ప్రకటించింది.**

'క్రమశిక్షణా సమస్యల' కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఖూజు) ఆల్ రౌండర్ ముహమ్మద్ జోహైబ్‌ను ఇంటికి పంపించేసింది. అయితే, అసలు వివరాలను మాత్రం ఇంకా వెల్లడించలేదు. ఈ క్రమంలో ఓ ట్వీట్ చేస్తూ.. "క్రమశిక్షణా సమస్యల కారణంగా ముహమ్మద్ జోహైబ్‌ను వెనక్కి పంపాం. మరిన్ని వివరాలు సరైన సమయంలో అందిస్తాం అంటూ ప్రకటించింది. 2026 టీ20 ప్రపంచ కప్ వార్మప్ మ్యాచ్‌లలో జోహైబ్ వేగంగా పరుగులు చేయడంలో ఇబ్బంది పడ్డాడు. నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో, అతను 3వ స్థానంలో బ్యాటింగ్ చేసి 26 బంతుల్లో 19 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో 9వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. ఎనిమిది ఓవర్లు ముగిసేసరికి యుఎఇ 7 వికట్లు నష్టపోయిన 28 పరుగులతో నిలిచింది. ఈ క్రమంలో స్కోర్ చేయడం కంటే కేవలం ఓవర్లను ఆడే ప్రయత్నం చేశాడు. 22 బంతుల్లో 16 పరుగులు మాత్రమే చేశాడు.



మొత్తం మీద, 27 ఏళ్ల ఈ ప్లేయర్ 16 టీ20ఐ లలో 20.20 సగటు, 103.76 స్ట్రైక్ రేట్‌తో 303 పరుగులు చేశాడు. జులై 2025లో నైజీరియాపై అతని ఏకైక అర్ధ సెంచరీ వచ్చింది.

ఫిబ్రవరి 10న చెన్నైలోని పీూ చిదంబరం స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరిగే ఖూజు ప్రారంభ మ్యాచ్‌కు ముందు జోహైబ్‌ను జట్టు నుంచి విడుదల చేశారు.

### యూఏఈ జట్టులో IND-PAK ఆటగాళ్లలో విభేదాలు..

ఇదిలా ఉండగా, యూఏఈ కెప్టెన్ ముహమ్మద్ వసీం 2025 టీ20 ఆసియా కప్ సందర్భంగా తాను చెప్పిన విషయాన్ని పునరుద్ఘాటించాడు. జట్టులో భారత సంతతికి చెందిన ఆటగాళ్లు, పాకిస్తాన్ సంతతికి చెందిన ఆటగాళ్ల మధ్య ఎటువంటి విభజన లేదని వసీం చెప్పుకొచ్చాడు. "నిజం చెప్పాలంటే, భారత్ -- పాకిస్తాన్ సమస్య లేదు. మేము ఖూజు తరపున ఆడుతున్నాం. మేం ఎల్లప్పుడూ మమ్మల్ని ఒక కుటుంబంలా చూసుకుంటున్నాం" అని వసీం తెలిపాడు.

"మేం ఒక కుటుంబంలా, స్నేహితులలా జీవిస్తున్నాం. మేం కలిసి సమయం గడుపుతున్నాం, కలిసి తింటున్నాం. నిజం చెప్పాలంటే యూఏఈ జట్టులో భారత్-పాకిస్తానీలు ఎవరూ లేరు" అని ఆయన అన్నాడు.

# గ్రూప్ మ్యాచ్‌లకు వద్దు.. నాకౌట్‌కే ముద్దు.. పెద్ద ప్లాన్‌తోనే బరిలోకి ఆస్ట్రేలియా.. అదేంటంటే?

**భారత్, శ్రీలంకలో జరుగుతోన్న ఐసీసీ టీ20 ప్రపంచ కప్ కోసం అన్ని జట్లు జోరుగా ప్రచారాన్ని మొదలుపెట్టాయి. అయితే, ఆస్ట్రేలియా జట్టు మాత్రం పెద్ద ప్లాన్ తో గ్రూప్ మ్యాచ్ లు ఆడుతోంది. ముఖ్యంగా టిమ్ డేవిడ్ ఆస్ట్రేలియా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. నెలన్నర క్రితం, హోబర్ట్ హరికేన్స్ తరపున జరిగిన బీబీఎల్ 2025-26 మ్యాచ్ సందర్భంగా ఈ హార్డ్ హిట్టింగ్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ గ్రేడ్ 2 స్నాయువు గాయంతో బాధపడ్డాడు. గాయం కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా టిమ్ డేవిడ్‌ను పాకిస్తాన్‌కు వెళ్లే టీం నుంచి మినహాయించింది. అయితే, భారత ఉపఖండంలో జరిగే ఐసీసీ మెగా ఈవెంట్‌కు ఈ డేంజరస్ ప్లేయర్ ను తిరిగి పిలిచింది.**

### ఆస్ట్రేలియా జట్టులోకి రీఎంట్రీ.. కానీ షరతులతో..

ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రేలియా గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లకు తాను దూరమయ్యే అవకాశం ఉందని టిమ్ డేవిడ్ సూచించాడు. గాయం కారణంగా పాకిస్తాన్‌లో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20ఐ సిరీస్‌కు దూరమైన తర్వాత ఇటీవలే ఆస్ట్రేలియా జట్టులోకి తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే.



టోర్నమెంట్ చివరి దశలకు అంటే, గ్రూప్ మ్యాచ్ ల తర్వాత క్రికెట్ ఆస్ట్రేలియా టిమ్ డేవిడ్‌ను రంగంలోకి దింపాలని చూస్తోందంట. స్నాయువు గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత, ఈ 29 ఏళ్ల హార్డ్ హిట్టర్ ఆస్ట్రేలియా తరపున బరిలోకి దిగుతాడని వార్తలు వినిపిస్తున్నాయి.

టిమ్ డేవిడ్ మాట్లాడుతూ, గ్రూప్ దశలో జట్టుకు దూరంగా ఉంటానని తనకు తెలుసునని, నేను కొంచెం సేపు బ్యాటింగ్ చేయాలనుకున్నాను, కానీ మేనేజ్మెంట్ మాత్రం కొంచెంసేపు వెయిట్ చేయండి' అని తెలిపిందంటూ చెప్పుకొచ్చాడు.

### ఐర్లాండ్, జింబాబ్వే, శ్రీలంక, ఓమన్ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం..

ఆస్ట్రేలియా జట్టు యాజమాన్యం టిమ్ డేవిడ్‌కు గ్రూప్ దశ నుంచి విశ్రాంతి ఇవ్వాలని నిర్ణయించుకుంది. దీంతో టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా ఆడే మొదటి నాలుగు మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది.

ఫిబ్రవరి 11న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌తో ఆస్ట్రేలియా జట్టు తన ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ప్రచారాన్ని ప్రారంభించనుంది.

### ఆస్ట్రేలియాను వెంటాడుతోన్న గాయాల బాధలు..

గాయం నుంచి ఇటీవల కోలుకున్న టిమ్ డేవిడ్‌ను ఆస్ట్రేలియా జట్టు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, 2021 విజేత జట్టు ఇప్పటికే అనేక ఇతర గాయాల సమస్యలతో బాధపడుతోంది. గత నెల చివర్లో, ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే కెప్టెన్ పాట్ కమ్మిన్స్ వెన్ను గాయం కారణంగా టోర్నమెంట్‌కు దూరమయ్యాడు.

2025-26 దీదీూ సీజన్‌లో సిడ్నీ సిక్సర్స్ తరపున వికెట్లు పడగొట్టిన కమ్మిన్స్ స్థానంలో బెన్ ద్వార్షుయిస్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ఎంపిక చేసింది.

తోటి లెజెండరీ పేస్‌మన్ జోష్ హేజిల్‌వుడ్ కూడా రెండు రోజుల క్రితం పూర్తిగా కోలుకోకపోవడంతో ఈ ఈవెంట్‌కు దూరమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన 2025-26 యాషెస్ సిరీస్‌ను కూడా హాజిల్‌వుడ్ పూర్తిగా కోల్పోయాడు. మిచెల్ మార్ష్ నాయకత్వంలో, ఆస్ట్రేలియా జట్టు టోర్నమెంట్ గ్రూప్ దీ దశను ఎదుర్కోనుంది. షెడ్యూల్ ప్రకారం, ఆస్ట్రేలియా ఫిబ్రవరి 11న ఐర్లాండ్‌తో, ఫిబ్రవరి 13న జింబాబ్వేతో, ఫిబ్రవరి 16న శ్రీలంకతో, ఫిబ్రవరి 20న ఒమన్‌తో పోటీ పడనుంది. గ్రూప్ దీ మ్యాచ్‌లకు కొలంబో, కాండీ ఆతిథ్యం ఇస్తాయి.

# నంబర్ 1గా సౌతాఫ్రికా.. రన్‌రేట్‌లోనూ తగ్గేదేలే..

## భారత్, పాక్‌ల పరిస్థితి ఏంటంటే?




**ఫిబ్రవరి 9న జరిగిన మ్యాచ్ తర్వాత టీ20 ప్రపంచ కప్ 2026 పాయింట్ల పట్టికలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే తమ తమ గ్రూపులలో అగ్రస్థానంలో నిలిచాయి. మరి భారత్, పాక్ టీంల పరిస్థితి ఏంటో ఓసారి చూద్దాం..**

దక్షిణాఫ్రికా తన గ్రూప్ పాయింట్ల పట్టికలో నంబర్ వన్ జట్టుగా అవతరించింది. కెనడాను ఓడించడంతో సౌతాఫ్రికా రన్ రేట్ కూడా టీ20 ప్రపంచ కప్ 2026లో ఆడుతున్న 20 జట్లలో అత్యుత్తమంగా మారింది. ఫిబ్రవరి 9 సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా కెనడాను 57 పరుగుల భారీ తేడాతో ఓడించింది. దీంతో పాయింట్ల పట్టికలో ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరింది. దక్షిణాఫ్రికా ఇప్పుడు గ్రూప్ డీ పాయింట్ల పట్టికలో నంబర్ 1గా నిలిచింది. దక్షిణాఫ్రికాతో పాటు, న్యూజిలాండ్, ఆఫ్ఘనిస్తాన్, కెనడా, యూఏఈ ఈ గ్రూప్‌లో ఉన్నాయి.

గ్రూప్ ఐ పాయింట్ల పట్టికలో , దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ ఒక మ్యాచ్ ఆడిన తర్వాత చెరో 2 పాయింట్లను కలిగి ఉన్నాయి. అయితే, దక్షిణాఫ్రికా అత్యుత్తమ రన్ రేట్ ఆధారంగా పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ౨20 ప్రపంచ కప్ 2026లో పాల్గొనే 20 జట్లలో దక్షిణాఫ్రికా రన్ రేట్ 2.850 అత్యుత్తమం.

### గ్రూప్ బిలో జింబాబ్వే..

దక్షిణాఫ్రికా తర్వాత, ప్రస్తుతం గ్రూప్‌లో ఆధిక్యంలో ఉన్న పొరుగున ఉన్న జింబాబ్వే రెండవ అత్యధిక రన్ రేట్‌ను కలిగి ఉంది. గ్రూప్ దీలో ఉన్న ఈ జట్టు ఒక మ్యాచ్ ఆడిన తర్వాత రెండు పాయింట్లను కలిగి ఉంది. 2.702 రన్ రేట్‌ను కలిగి ఉంది. శ్రీలంక కూడా రెండు పాయింట్లతో ఉంది. కానీ 1.000 రన్ రేట్‌తో గ్రూప్‌లో రెండవ స్థానంలో ఉంది.

### గ్రూప్ సి పాయింట్ల పట్టిక పరిస్థితి..

గ్రూప్ సిలో నంబర్ 1 స్థానంలో ఉన్న వెస్టిండీస్ జట్టు మూడో అత్యధిక రన్ రేట్ కలిగి ఉంది. వెస్టిండీస్ స్కాట్లాండ్ పై తన తొలి మ్యాచ్ లో గెలిచి 2 పాయింట్లు, 1.750 రన్ రేట్ తో నంబర్ 1 జట్టుగా నిలిచింది. 2 మ్యాచ్ లలో 1 విజయం, 1 ఓటమితో స్కాట్లాండ్ గ్రూప్ పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో ఉంది. ఇంతలో, నేపాల్ పై తృటిలో ఓటమి నుంచి తప్పించుకున్న జట్టు మూడో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ రెండింటికీ చెరో 2 పాయింట్లు ఉన్నాయి. కానీ స్కాట్లాండ్ ఇంగ్లాండ్ కంటే మెరుగైన రన్ రేట్ కలిగి ఉంది.

### గ్రూప్ 'ఎ'పాయింట్ల పట్టికలో భారత్, పాకిస్తాన్ పరిస్థితి..

భారత్-పాకిస్తాన్ గ్రూప్‌లో ఈ రెండు జట్లు అగ్రస్థానంలో ఉన్నాయి. గ్రూప్ ాలో భారత్ 2 పాయింట్లు, 1.450 పరుగులతో అగ్రస్థానంలో ఉంది. రెండవ స్థానంలో ఉన్న పాకిస్తాన్ కూడా 2 పాయింట్లతో ఉంది. కానీ రన్ రేట్ 0.240గా నిలిచింది.

# టీ20 ప్రపంచకప్ హిస్టరీలో హ్యాట్రిక్ వీరులు..

## టాప్ 5లో తోపు బౌలర్ ఎవరంటే?

**ఐసీసీ టీ20 ప్రపంచ కప్ చరిత్రలో తొలి హ్యాట్రిక్ సాధించిన రికార్డు ఆస్ట్రేలియా మాజీ ఫాస్ట్ బౌలర్ బ్రెట్ లీ పేరిట ఉంది. లీతో పాటు, ఈ టోర్నమెంట్‌లో మరో ఐదుగురు బౌలర్లు ఈ ఘనతను సాధించారు.**



ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2026 ఫిబ్రవరి 7 నుంచి మొదలైంది. ఇప్పటి వరకు దాదాపు 10 మ్యాచ్ లు పూర్తయ్యాయి. టోర్నమెంట్‌లో మొత్తం 20 జట్లు పాల్గొన్న సంగతి తెలిసిందే. చిన్న జట్లుగా బరిలోకి దిగి దిగ్గజ టీంలకే దిమ్మతిరిగే షాక్ ఇస్తున్నాయి. అమెరికా, నేపాల్ వంటి జట్లు టోర్నమెంట్ లో ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో పొట్టి ఫార్మాట్ అంటేనే బ్యాటర్ల మోత అని భావిస్తుంటారు. కానీ, ఈ ఫార్మాట్ లో బౌలర్ల కూడా తమదైన రోజున దిగ్గజ బ్యాటర్లకు కూడా దడదడ పుట్టిస్తుంటారు. ఇక ముఖ్యంగా ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్ సాధించిన బౌలర్లు కూడా ఉన్నారు. టీ20 ప్రపంచ కప్‌లో హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టించిన 8మంది బౌలర్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

### టీ20 ప్రపంచకప్‌లో హ్యాట్రిక్ సాధించిన 8 మంది బౌలర్లు..

1. బ్రెట్ లీ (ఆస్ట్రేలియా): ఐసీసీ టీ20 ప్రపంచ కప్ హిస్టరీలో హ్యాట్రిక్ సాధించిన తొలి బౌలర్ గా ఆస్ట్రేలియా మాజీ దిగ్గజం బ్రెట్ లీ రికార్డ్ సాధించాడు. 2007లో బంగ్లాదేశ్‌పై ఈ ఘనతను సాధించాడు.

2. కర్టిస్ కాంఫర్ (ఐర్లాండ్): బ్రెట్ లీ తర్వాత రెండో బౌలర్ గా ఐర్లాండ్‌కు చెందిన కర్టిస్ కాంఫర్ ఈ రికార్డుల్లో చేర్చు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో కర్టిస్ కాంఫర్ తన కెరీర్ లోనే తొలి హ్యాట్రిక్ సాధించాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో నెదర్లాండ్స్‌పై క్యాంఫర్ ఈ ఘనతను సాధించాడు.

3. వనిందు హసరంగా (శ్రీలంక): శ్రీలంక ఆల్ రౌండర్ వనిందు హసరంగా ఈ లిస్ట్ లో మూడో బౌలర్ గా చేరాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు.

4. కగిసో రబడ (దక్షిణాఫ్రికా): దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ టీ20 ప్రపంచ కప్ 2021లో హ్యాట్రిక్ సాధించాడు. ఇంగ్లాండ్‌పై ఈ ఘనత సాధించి టీ20 ప్రపంచ కప్‌లో నాలుగో స్థానంలో నిలిచాడు.

5. కార్తీక్ మెయ్యప్పన్ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (ఖూజు) కు చెందిన కార్తీక్ మెయ్యప్పన్ ఐసీసీ టీ20 ప్రపంచ కప్ లో హ్యాట్రిక్ సాధించిన ఐదవ బౌలర్ గా నిలిచ్చు. మెయ్యప్పన్ 2022 లో శ్రీలంకపై హ్యాట్రిక్ సాధించి చరిత్ర సృష్టించాడు.

# ఓ ఇన్నింగ్స్‌లో ఊచకోత.. మరో ఇన్నింగ్స్‌లో జీరో..

## భయపెడుతోన్న యంగ్ సెన్సేషన్ ఫాం

గత 6 ఇన్నింగ్స్‌లలో అభిషేక్ శర్మ రెండు అద్భుతమైన అర్ధ సెంచరీలు సాధించాడు. కానీ, ఇదే 6 ఇన్నింగ్స్ ల్లో జీరో బాధితుడిగా మారడం టీమిండియాకు ఆందోళన కలిగిస్తోంది. ఈ యంగ్ గన్ అస్థిరమైన ఫాంతో టీమిండియా హెడ్ కోచ్ కూడా అసహనంగానే కనిపిస్తున్నాడు. అభిషేక్ శర్మ టీ20 క్రికెట్‌లో ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా పేరుగాంచిన సంగతి తెలిసిందే. ఈ యువ బ్యాటర్ ఇప్పటికే తన తుఫాన్ బ్యాటింగ్‌తో సంచలనం సృష్టించాడు. బరిలోకి దిగితే రికార్డుల వర్షం కురిపిస్తున్న సంగతి తెలిసిందే.

అయితే, అభిషేక్ శర్మ ప్రస్తుతం స్థిరమైన ప్రదర్శనలు ఇవ్వడానికి ఇబ్బంది పడుతుడు. గత 6 ఇన్నింగ్స్‌లలో దారుణంగా విఫలమవుతున్నాడు. ఈ 6 ఇన్నింగ్స్‌లలో అతను 3సార్లు జీరోకే ఔట్ కావడం గమనార్హం. అయితే అతను ఫామ్‌లో లేడని అర్థమవుతోంది. ఎందుకంటే, నాగ్‌పూర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ కేవలం 35 బంతుల్లో 84 పరుగులు చేశాడు. కానీ, రాయ్‌పూర్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో సున్నాకి వికెట్ సమర్పించుకున్నాడు.

న్యూజిలాండ్‌తో గౌహతిలో జరిగిన మూడో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ కేవలం 20 బంతుల్లో 68 పరుగులు చేశాడు. అయితే, విశాఖపట్నంలో జరిగిన నాల్గవ మ్యాచ్‌లో డకౌట్‌గా నిరాశపరిచాడు. ఆ తర్వాత, తిరువనంతపురంలో న్యూజిలాండ్‌తో జరిగిన చివరి టీ20 మ్యాచ్‌లో అతను 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో మొదటి మ్యాచ్‌లో ఖూూతో జరిగిన మ్యాచ్‌లో అతను సున్నాకి అవుట్ అయ్యాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787